ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 11 డిసెంబరు 2025 | 7





బోట్ ఫెస్టివల్ ప్రాంతం పరిశీలన


తాడిపూడి వద్ద బోట్ ఫెస్టివల్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు, కోచ్‌లు


ఆత్రేయపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి ముందుగా జనవరి 11, 12, 13 తేదీల్లో సర్‌ఆర్థర్‌కాటన్ గోదావరి ట్రోఫీ పేరుతో నిర్వహిస్తున్న జాతీయస్థాయి పడవ, ఈత పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం ఆత్రేయపురం తహశీల్దారు రాజేశ్వరరావు పర్యవేక్షించారు. తాడిపూడి-ఉచ్చిలి గోదావరి సెంట్రల్ డెల్టా ప్రధాన కాలువలో కెనాయింగ్, కయాకింగ్ స్టేట్ ప్రెసిడెంట్ డి.బలరామనాయుడు, జాయింట్ సెక్రటరీ డి.ఉదయకుమార్, స్టేట్ ఫౌండర్ శివారెడ్డి, సబ్‌కోచ్ ఎం.శ్రీనులతో కలిసి ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా పడవ,ఈత పోటీల ప్రక్రియ నమోదు చేస్తామని తహసీల్దార్ తెలిపారు. గతేడాది కంటే భిన్నంగా ఈ పోటీలు నిర్వహించడంతోపాటు ఇతర రాష్ట్రాల్లోఉన్న పర్యాటకులు సంక్రాంతి మూడు రోజులు డ్రాగన్ పోటీలు తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, తెలుగు యువత మండల అధ్యక్షుడు వెత్సా అనిల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ గ్రేడ్ మున్సిపాల్టీగా మండపేట

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- వార్డుల సంఖ్య పెంపుతోపాటు పెరగనున్న ఉద్యోగులు
- నిధులు పెంపు.. అభివృద్ధిలో పరుగులు

మండపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) మండపేట మున్సిపాల్టీని స్పెషల్‌గ్రేడ్‌గా చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు గ్రేడ్-1గాఉన్న ఈమున్సిపాల్టీ స్పెషల్ గ్రేడ్‌గా సాధించడంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేసిన కృషి ఫలితంగా కార్యరూపం దాల్చింది. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం జీవోనెం.266ను విడుదల చేసింది. గత మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మండపేట మున్సిపాల్టీ స్పెషల్‌గ్రేడ్ కానుందని ఎమ్మెల్యే వేగుళ్ల ప్రకటించారు. ఆయన అన్నట్టుగానే కొద్దిరోజులకే ఇది సాధ్యపడింది.

మండపేట మున్సిపాల్టీ 1958, అక్టోబరు 1న ఏర్పడింది. ఇక్కడ ప్రస్తుతం మున్సిపాల్టీలో 30 వార్డులుండగా వాటి సంఖ్య 36కి పెరగనుంది. మున్సిపాల్టీలోని ప్రభుత్వ విభాగాల్లో కూడా ఉద్యోగులు సంఖ్య పెరగనుంది. ప్రస్తుతం మున్సిపల్ డీఈ ఒకరు, ఏఈలు ఇద్దరు ఉన్నారు. ఇకనుంచి స్పెషల్ గ్రేడ్ కావడంతో మున్సిపల్ ఈఈతోపాటు డీఈకి అదనంగా మరొకరు, ఇద్దరు ఏఈలతోపాటు మరోఇద్దరు పెరగనున్నారు. దీంతో ఇద్దరు డీఈలు, నలుగురు ఏఈల పోస్టులు ఉంటాయి. అసిస్టెంట్ సిటీ ప్లానర్, పరిపాలనాధికారి, పీవో మెప్మాతోపాటు ఆరోగ్యశాఖధికారులు రానున్నారు. మండపేట పట్టణం స్పెషల్‌గ్రేడ్ మున్సిపాల్టీగా మారడంతో ప్రభుత్వంనుంచి అదనపు నిధులు వస్తాయి, అన్నిరంగాల్లో అభివృద్ధి చెందనుంది. మండపేట మున్సిపాల్టీ స్పెషల్‌గ్రేడ్ మున్సిపాల్టీగా అనుమతులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు, పురపాలకశాఖ మంత్రి పి.నారాయణలకు ఎమ్మెల్యే వేగుళ్ల ధన్యవాదాలు తెలిపారు.



2 జిల్లాలకు 100 బస్‌లు

ఈ-బస్‌లు.. వస్తున్నాయ్!

కొత్తగా ప్రగతి రథచక్రాలు

వాస్తవానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు 150 భారీ ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. తొలివిడత కాకినాడ జిల్లాకు 50, తూర్పుగోదావరి జిల్లాకు 100 బస్సులను కొనుగోలు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి కొన్ని నెలల కిందట రాజమహేంద్రవరం వచ్చినప్పుడు అధికారులతో ఈ విషయంపై చర్చ జరగ్గా ఉమ్మడి జిల్లాకు తొలి విడత కింద 150 బస్సులు అవసరమని వివరిం చారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాలకు ఈవీ బస్సులను కేటాయించాల్సి ఉన్న నేపథ్యంలో కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు వంద బస్సులను మాత్రమే కేటాయించారు. ఒక్కో బ స్సులో 40 వరకు సీట్లుండే ఈవీ బస్సుల్లో అన్ని ఆధునిక సౌకర్యాలు ఉంటాయని అధికారులు వివరించారు. ఒక్కో బస్సు ధర రూ.1.50 కోట్లు.. 100 బస్సులకు రూ.150 కోట్ల అవుతుంది.

- ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీకి ఎలక్ట్రికల్ బస్సులు
- కాకినాడ, 'తూర్పు'నకు 100 కేటాయింపు
- 'కోనసీమ'కు మలి విడత
- ఆర్టీసీ ఉన్నతాధికారులకు సమాచారం
- ఒక్కో బస్సు ఖరీదు రూ.1.5 కోట్లు
- రూ.150 కోట్లతో కొనుగోలు
- ఆరు నెలల్లో రోడ్డెక్కనున్న బస్సులు
- ఉమ్మడి జిల్లాలో 20 ఛార్జింగ్ స్టేషన్లు
- భారీగా ఖర్చు తగ్గుతుందని అంచనా

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో త్వరలో ఆర్టీసీ ఈవీ బస్సులు రోడ్డెక్కనున్నాయి. మరో ఆరు నెలల్లో ప్రయాణికులకు అందుబాటులోకి రాబోతున్నాయి. ఈ మేరకు ఆర్టీసీ ఉన్నతాధికారులకు సమాచారం అందింది. కాకినాడ జిల్లాకు 50, తూర్పుగోదావరి జిల్లాకు 50 చొప్పున ప్రభుత్వం ఈవీ బస్సు లను కేటాయిస్తోంది.కోనసీమ జిల్లాకు ఈ దఫా వాయిదా వేసి మలివిడతలో కేటాయించనున్నారు. ఒక్కో బస్సు రూ.1.50 కోట్ల చొప్పున 100 బస్సులకు ప్రభుత్వం రూ.150 కోట్లు వెచ్చించబోతోంది.బస్సుల రాకతో ఖర్చుల భారం తగ్గుతుందని అధికారులు అంచనా వేశారు.

ఒక్కో బస్సులో 40 సీట్లు

గత వైసీపీ సర్కారు ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేసింది. కొత్త బస్సుల కొనుగోలు, అదనపు రూట్లను అటకెక్కించేసింది. ఇప్పుడు ప్రభుత్వం ఆర్టీసీకి అన్ని విధాలా సహకారం అందిస్తుండడంతో ప్రయాణికులను దగ్గరయ్యేందుకు ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేస్తోంది.అందులో భాగంగా కాకినాడ జిల్లాకు 50, తూర్పుగోదావరి జిల్లాకు 50 బస్సులు కేటాయిస్తూ ఆదేశాలిచ్చింది.ఆర్టీసీ ఉన్నతాధికారులకు సమాచారం అందింది.ఈవీ బస్సులకు రూట్లను ఎంపిక చేయాలని ఆదేశించడంతో తాజాగా అధికారులు పూర్తిచేశారు. ఒక్కో బస్‌లో 40 సీట్లు ఉంటాయి.

20 ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు

100 ఎలక్ట్రికల్ బస్సులకు ఛార్జింగ్ స్టేషన్లకు భారీగా ఖర్చవుతుందని భావిస్తున్నారు. హైస్పీడ్‌తో కూడిన ఛార్జింగ్ కేంద్రాలను 20 వరకు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, తునిలో వీటిని ఏర్పాటు చేయనున్నారు.బ్యాటరీ బైక్‌కు కనీసం 6 గంటల వరకు ఛార్జింగ్ చేస్తేనే గానీ బ్యాటరీ ఫుల్ కాదు. కానీ రాబోయే ఎలక్ట్రికల్ బస్సులకు 2 గంటలు ఛార్జింగ్ చేస్తే బ్యాటరీ ఫుల్ కానున్నాయి. కొత్త ఎలక్ట్రికల్ బస్సులు భారీ బ్యాటరీ సామర్థ్యంతో తయారవుతాయి. రోజులో ఒకసారి ఛార్జింగ్ చేస్తే సరిపోవచ్చని అధి కారులు చెబుతున్నారు. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఎలక్ట్రిక్‌తో లాభాల పంటే..

ఇప్పుడు ఎక్కడ చూసినా ఎలక్ట్రికల్ వాహనాలపైనే మొగ్గుచూపుతున్నారు. ఆర్టీసీ సైతం ఈవీ బాట పట్టింది. వచ్చే ఏడాది జూన్ నాటికి ఎలక్ట్రికల్ బస్సులను భారీగా రోడ్లపైకి దించబోతోంది. ఇప్పటికే డీజిల్ ధరలు పెరగడంతో నానాటికీ నిర్వహణ వ్యయం తడిసి మోపెడవుతోంది. దీంతో లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఆర్టీసీ చవిచూస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రయాణికుల సర్వీసుల్లోను కొత్త పద్ధతులు అనుసరించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఖర్చులు నియంత్రించుకోవాల్సిన అవసరత ఏర్పడింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కొత్త బస్సుల కొనుగోలు, రద్దీ రూట్లలో సర్వీసుల పెంపు వరకు అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది.అందులో భాగంగా ఇకపై ఈవీ బస్సులను భారీగా కొనుగోలు చేసి అందిస్తోంది.

రూట్‌లు ఇలా

వంద ఈవీ బస్సుల్లో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల నుంచి విశాఖ, విజయవాడ రూట్‌లో 46 బస్సులు నడపనున్నారు.కాకినాడ- అమలాపురం, రాజమహేంద్రవరం-అమలాపురం రూట్‌లో 12, కాకినాడ- రాజమహేంద్రవరం నగరాల మధ్య రోజుకు 14 రెండు జిల్లాల ఈవీ బస్సులు తిప్పాలని నిర్ణయించారు.కాకినాడ జిల్లాకు కేటాయించిన 50 ఎలక్ట్రికల్ బస్సుల్లో కాకినాడ-విశాఖపట్నం 30, కాకినాడ -రాజమహేంద్రవరం 7, కాకినాడ- అమలాపురం 6, కాకినాడ- నర్సీపట్నం 4, కాకినాడ-తుని 3 చొప్పున ఖరారు చేశారు. తూర్పు గోదావరి జిల్లాకు కేటాయించిన 50 బస్సుల్లో రాజమహేంద్రవరం- విజయవాడ 16, రాజమహేంద్రవరం- కాకినాడ 12, రాజమహేంద్రవరం-అమలాపురం 12, రాజ మహేంద్రవరం-తుని 10 బస్సులను తిప్పేలా ప్రణాళిక ఖరారు చేశారు.ఈవీ బస్సుల్లో టికెట్ ధరలు బాగా తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

నాలుగు మెకనైజ్డ్ రీచ్‌లకు

రేపటి నుంచి టెండర్ల ప్రక్రియ

- జిల్లాస్థాయి శాండ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక పాలసీని పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించడానికి జిల్లాస్థాయి శాండ్ కమిటీ పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం బుధవారం కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సభ్యులతో నిర్వహించారు. ఉచితఇసుక పాలసీ టెండరు ప్రక్రియఅంశాలు, కొత్తరీచ్‌లు అప్రూవల్, టెండరు నోటిఫికేషన్ జారీ వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సభ్యులతో కలెక్టర్ మాట్లాడుతూ ఏపీ మెకనైజ్డ్ నాలుగు రీచ్‌లకు టెండరు ప్రక్రియ ఈనెల 12 నుంచి నిర్వహిస్తున్నామన్నారు. వీటిలో మెర్లపాలెం, కపిలేశ్వరపురం, ఆలమూరు, జొన్నాడ రీచ్‌లు ఉన్నాయన్నారు. టెండరుదారులు అర్హతలు, నియమావళి, సాంకేతిక అర్హత, వార్షిక ఆదాయ విధానాలు, లైసెన్సులు వంటి వాటిపై సమీక్షించి పలు సూచనలు చేశారు. స్టాకు యార్డుల లీజు అంశాలపై తహశీల్దార్‌తో సర్టిఫికేషన్ చేయించాలని, లీజుదారులనుంచి నోఅబ్జెక్షన్ ధ్రువపత్రాన్ని తీసుకోవాలని అన్నారు. ప్రతివాహనానికి జీపీఎస్ కోఆర్డినేటర్లు ఉండాలని, ఏటిగట్టుపై ఇసుక లోడుతో రాకపోకల రవాణా నిర్వహించకుండా జలవనరులశాఖ నిఘా ఉంచాలని, ఇసుక రవాణతో ఏటిగట్లు బలహీనపడే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతిపాదిత మార్గాల్లోనే ఇసుక రవాణా నిర్వహించాలని, రోడ్లు, బ్రిడ్జిలు కండిషన్ల ప్రకారం మాత్రమే వాహనాల రాకపోకలకు అనుమతించాలని సూచించారు. 12న నాలుగు రీచ్‌లకు టెండర్లు కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ప్రక్రియ ప్రారంభిస్తామని, 17న సాయంత్రం 5గంటల వరకు టెండర్లు దాఖలు చేయవచ్చు నని, 18న టెండర్ల పరిశీలన, అర్హత సాధించిన టెండరుదారుల పేర్లతో తుది జాబితా ఉంటుందని తెలిపారు. జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి వంశీధర్‌రెడ్డి, హెడ్‌వర్క్స్ ఈఈ జి.శ్రీనివాస్, జిల్లా రవాణాధికారి జి.శ్రీనివాసరావు, జీఎస్‌డబ్ల్యుఎస్ కోఆర్డినేటర్ సువిజయ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ ఏవీఎస్ రాజన్ పాల్గొన్నారు.

పార్లమెంటు స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ


పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ హరీష్

అమలాపురం,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని పార్లమెంటు సి-బ్లాక్‌లో జరిగిన కార్మిక, జౌళి, నైపుణ్యాభివృద్ధి పార్లమెంటు స్టాండింగ్ కమిటీ సమావేశంలో అమలాపురం ఎంపీ గంటిహరీష్ పాల్గొన్నారు. స్కిల్ డెవలెప్మెంట్, మంత్రిత్వశాఖ అధికారులతో మూడు కీలక అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ పనితీరు, విదేశీ ఉపాధి కోసం సిద్ధమవుతున్న, వలస కార్మికులకు అందిస్తున్న నైపుణ్య, భాషా శిక్షణ, ప్రధానమంత్రి కౌశల్ వికాస యోజన గురించి చర్చించినట్టు ఎంపీ హరీష్ తెలిపారు. యువతకు అందుబాటులో ఉండి అవకాశాలను, విదేశాలకు వెళ్లే భారత కార్మికులు ఆధారపడే సహాయ వ్యవస్థలను ప్రత్యక్షంగా ప్రభావితం చేసేవని, శిక్షణ కేంద్రాలపై మరింత బలమైన పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కార్మిక ఉపాధి, జౌళి, స్కిల్ డెవలెప్మెంట్ మంత్రిత్వశాఖల ఆర్థిక సంవత్సర డిమాండ్స్ ఫర్ గ్రాండ్స్‌పై సిద్ధం చేసిన డ్రాఫ్ట్ యాక్షన్ టేకెన్ రిపోర్టును కమిటీ పరిశీలించి ఆమోదించినట్టు ఎంపీ తెలిపారు.

జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని.. దేశవ్యాప్తంగా విస్తరింపచేద్దాం

- సమన్వయంతో పనిచేద్దాం
- పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అంబాజీపేట,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవాన్ని రాష్ట్రపండుగగా ప్రభుత్వం ఖరారు చేసిన నేపథ్యంలో ఈ ఉత్సవాన్ని దేశవ్యాప్తంగా విస్తరింపచేసేలా అందరూ సమన్వయంతో పనిచేసివైభోవేతంగా నిర్వహిద్దామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. కనుమ సందర్భంగా నిర్వహించే ఉత్సవానికి సంబంధించి అంబాజీపేట మండలం మొసలపల్లి పంచాయతీ కార్యాలయంవద్ద తహశీల్దారు చినబాబు అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే గిడ్డి మాట్లాడుతూ లక్షల మంది వీక్షించే ఈ ఉత్సవాన్ని రాష్ట్రప్రభుత్వం గుర్తించాలనే ఉద్దేశ్యంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దీంతో సీఎం సానుకూలంగా స్పందించారని, త్వరలో రాష్ట్రపండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేస్తుందని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తొలుత నిర్వాహకులు మాట్లాడుతూ ప్రభల తీర్థంలో మొబైల్ టాయిలెట్స్, తాగునీరు, ట్రాఫిక్ ఆంక్షలు విధించాలన్నారు. కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ మాట్లాడుతూ తీర్థంలో సౌకర్యాలు ఏర్పాటుచేసేలా అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. పారిశుధ్య పనులు, జంగిల్ క్లియరన్స్ ముమ్మరంగా చేయాలని ఎంపీడీవో బి.మమతను ఆదేశించారు. కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్ మాట్లాడుతూ ప్రభలపై సినీ, రాజకీయ, ఇతరఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా ఉత్సవకమిటీలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభలకు అడ్డువచ్చే విద్యుత్‌తీగలను తొలగించాలని నిర్వాహకులు విద్యుత్‌శాఖ అధికారులను కోరారు. జిల్లా దేవదాయశాఖాధికారి సత్యనారాయణ, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు శిరిగినీడి వెంకటేశ్వరరావు, మట్టపర్తి భారతి, ఆర్‌అండ్‌బీ డీఈ రాజేంద్ర, ఎంపీడీవో మమత, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జయశ్రీ, ఏపీవో ఏ.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

డీఈవోగా నాగేశ్వరరావు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న పి.నాగేశ్వరరావు

ముమ్మిడివరం,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారిగా పి.నాగేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ డీఈవోగా విధులు నిర్వహించిన డాక్టర్ షేక్ సలీంబాషా గుంటూరు డీఈవోగా బదిలీ కావడంతో జిల్లాలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావు డీఈవోగా నియమితులయ్యారు. బుధవారం బాధ్యతలు చేపట్టిన ఆయన్ను సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మి, డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం, పి.రాంబాబు, ఎంవీవీ సత్యనారాయణ, డీఈవో కార్యాలయ ఏడీ నక్కా సురేష్, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఈ సందర్భంగా డీఈవో నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాను విద్యాపరంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామనని, పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానని తెలిపారు.



ఈ రూటుకి విరామం!


పి.గన్నవరం కొత్త అక్విడెక్టు.. మరమ్మతులకు గురైన జాయింట్లు

పి.గన్నవరం అక్విడెక్టుకు మరమ్మతులు నిర్వహించనున్నారు. అక్విడెక్టుపై జాయింట్‌లు దెబ్బతినడంతో ఎక్స్‌పాన్షన్ జాయింట్‌ల ఏర్పాటుకు పనులు చేపట్టనున్నారు. జిల్లాలో ఇప్పటికే దిండి-చించినాడ వారధికి మరమ్మతులు జరుగుతున్నాయి. దీని నిమిత్తం నాలుగైదు నెలలుగా వారధి మూసివేతతో ఇప్పటికే రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పుడు పి.గన్నవరం అక్విడెక్టుకు మరమ్మతులు చేపట్టనుండడంతో ప్రజారవాణాతోపాటు వ్యాపారరంగాలకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి. ముఖ్యంగా కోనసీమ కేంద్రంగా జరిగే కొబ్బరి, ఆక్వారంగాల రవాణాకు ప్రత్యామ్నాయ రూట్లతో కాస్త ఆర్థిక భారం పడనుంది.

- పి.గన్నవరం అక్విడెక్టుకు త్వరలో మరమ్మతులు
- 40 రోజులపాటు నిలిచిపోనున్న రాకపోకలు
- పాత అక్విడెక్టుపై అడ్డంకులు తొలగింపు పనులు
- తాత్కాలిక రాకపోకలకు వీలుగా ఏర్పాట్లు
- కొబ్బరి, ఆక్వా రంగాల రవాణాకు ఆర్థిక భారం


పాత అక్విడెక్టుపై తొలగింపు పనులు

(పి.గన్నవరం-ఆంధ్రజ్యోతి)
పి.గన్నవరం అక్విడెక్టుపై ఎక్స్‌పేన్షన్ జాయింట్ల ఏర్పాటుకు 40 రోజులపాటు రాకపోకలు నిలిపివేయనున్నారు. అక్విడెక్టుపై జాయింట్‌లు పూర్తిస్థాయిలో పాడైపోవడంతో వాటి మధ్య రూ.49.30 లక్షల నిధులతో ఎక్స్‌పాన్షన్ జాయింట్‌లు ఏర్పాటు చేయనున్నారు. 33 చోట్ల ఏడున్నర మీటర్ల వెడల్పుతో కూడిన ఎక్స్‌పాన్షన్ జాయింట్‌లు అవసరమైనచోట వేరింగ్ కోట్స్ ఏర్పాటు చేస్తారు. ఫుట్‌పాత్‌కు మరమ్మతులు, ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయానికి సీసీ రోడ్డు నిర్మాణం తదితర నిర్వహించనున్నట్టు అధికారులు చెబుతున్నారు. అక్విడెక్టుపై పనిచేసే సమయంలో 40 రోజులపాటు ట్రాఫిక్‌ను మళ్లించాల్సిన అవసరం ఉంది. ఎక్స్‌పాన్షన్ జాయింట్లకు సంబంధించి మూడు డిజైన్‌లను పరిశీలిస్తున్నారని, వాటిలో ఒకదాన్ని నిర్ధారించి పది రోజుల్లో పనులు మొదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

వినియోగంలోకి పాత అక్విడెక్టు


కొత్త అక్విడెక్టుపై పనులు ప్రారంభించిన వెంటనే రాజోలుదీవికి వెళ్లే ట్రాఫిక్‌ను పాత అక్విడెక్టుపైకి మళ్లిస్తామని అధికారులు చెప్తున్నారు. ముఖ్యంగా 75 ఏళ్ల కిందట నిర్మించిన పాతఅక్విడెక్టు కెపాసిటీని సంబంధిత ఇంజనీర్లతో చర్చించి సామర్థ్యం మేరకు వాహనాలు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోనున్నారు. ప్రస్తుతం దీంతో పాత అక్విడెక్టుపై ఉన్న టూరిజం అభివృద్ధి నిమిత్తం సగం మేర ఏర్పాటుచేసిన రైలింగ్‌లను తొలగిస్తున్నారు. రామాలయం ఎదుట స్వామివారి కల్యాణం కోసం ఏర్పాటు చేసిన పర్ణశాలను సైతం తొలగించారు. డైలీమార్కెట్‌ను సైతం తొలగించాలని ఇప్పటికే దుకాణందారులకు నోటీసులు అందించారు. ప్రధాన రహదారి నుంచి పాతఅక్విడెక్టు వరకు వాహనాల రాకపోకలకు ఇబ్బందిలేకుండా రోడ్డు 25 అడుగులు వెడల్పు ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొత్త అక్విడెక్టుపై పనిచేసే సమయంలో పాత అక్విడెక్టుపై ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలకు మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. బస్సులు, భారీ వాహనాలు సైతం బోడసుకుర్రు వైపు నుంచి వెళ్లేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఆర్టీసీ అధికారులకు సైతం ఇప్పటికే నోటీసులు అందించినట్టు ఇరిగేషన్ అధికారి స్పష్టంచేశారు. డైలీబజార్ నిమిత్తం ఏటిగట్టుపై తాత్కాలిక షాపులు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వనున్నారు.

బోడసకుర్రు బ్రిడ్జికి పెరగనున్న భారం

జిల్లాలోని దిండి-చించినాడ, పి.గన్నవరం అక్విడెక్టులు ఏకకాలంలో మరమ్మతులు నిర్వహిస్తే భారీ వాహనాలకు, ప్రజారవాణాకు బ్రేక్ పడుతుంది. ఇప్పటికే చించినాడ పనులు ప్రారంభించగా, పి.గన్నవరంలో త్వరలో పనులు ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లా నుంచి రాజోలు వైపు వెళ్లే భారీ వాహనాలు సిద్ధాంతం బ్రిడ్జిపై నుంచి వచ్చి అమలాపురం మీదుగా బోడసకుర్రు బ్రిడ్జిపైకి రాజోలు చేరుకోవాల్సి ఉంది. రాజోలు వైపు నుంచి పాలకొల్లు, నరసాపురం, భీమవరం మార్కెట్లకు వ్యవసాయ ఉత్పత్తులు తరలించాలంటే బోడసకుర్రు బ్రిడ్జిపై నుంచి అమలాపురం చేరుకుని వయా రావులపాలెం మీదుగా సిద్ధాంతం బ్రిడ్జి దాటాల్సి ఉంది. ఎటుచూసినా భారీ వాహనాలు, బస్సులు బోడసకుర్రు బ్రిడ్జిపై నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. ఈ క్రమంలో బోడసకుర్రు బ్రిడ్జిపై భారీ వాహనాల లోడు పడనుంది. ఇక ప్రజా రవాణా విషయానికి వస్తే రాజోలు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు రాజోలు వచ్చి తిరిగి అమలాపురం చేరుకుని తర్వాత వయా రావులపాలెం మీదుగా వెళ్లాల్సి ఉంది.

యథావిధిగానే రామచంద్రపురం డివిజన్

- కార్మికశాఖ మంత్రి సుభాష్‌కు సీఎం చంద్రబాబు హామీ
- ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాలు యథాతథం: మంత్రి సుభాష్


సీఎంకు వినతిపత్రాన్ని అందచేస్తున్న మంత్రి సుభాష్

అమలాపురం/ద్రాక్షారామ(రామచంద్రపురం), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని రామచంద్రపురం రెవెన్యూడివిజన్, సబ్‌డివిజనల్ పోలీస్‌అధికారి కార్యాలయాలను ఎట్టిపరిస్థితుల్లో యథాతథంగా రామచంద్రపురం కేంద్రంగానే కొనసాగుతాయని సీఎం చంద్రబాబు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు హామీఇచ్చారు. అమరావతిలో బుధవారం ఇద్దరు భేటీ అయ్యారు. జిల్లానుంచి మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయడం వల్ల రామచంద్రపురం, ద్రాక్షారామ, కె.గంగవరం మండలాలతో కూడిన రెవెన్యూ డివిజన్ రద్దవుతుందని ప్రజలు భావిస్తున్న తరుణంలో మంత్రి సుభాష్ ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు.రామచంద్రపురం రెవెన్యూడివిజన్, డీఎస్పీ కార్యాలయాలు యథావిధిగానే ఉంటాయని, ప్రజలు ఆందోళన చెందవద్దని సీఎం భరోసా ఇచ్చారు. రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయిస్తానని సీఎం హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల అంశంతోపాటు ఇతర సమస్యలను సీఎం దృష్టిలో పెట్టినట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ విషయంలో ప్రజలు అపోహలు నమ్మవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు.

ఉడత ఊపులకు చింతకాయలు రాలుతాయా అని సాధారణంగా అందరూ అనుకుంటాం. అదేమో కానీ ఉడత కొరుకుడికి మాత్రం కొబ్బరికాయలు రాలిపోతున్నాయి. దీంతో కొబ్బరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఉడత చిన్నదే కానీ అదిచేసే నష్టం మాత్రం ఎక్కువగా ఉంటోందని పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు గమనించారు. దీంతో ప్రయోగాత్మకంగా కొబ్బరిచెట్లకు స్టీలు తొడుగులు ఏర్పాటుచేసి ఉడతలు చెట్లు ఎక్కకుండా నివారిస్తున్నారు. దీంతో ఆశించిన ఫలితాలు కొంతమేర వస్తున్నాయని చెప్తున్నారు.



కొబ్బరి చెట్లకు అమర్చిన స్టీలు తొడుగులు





ఉడత కొట్టుడు!



- కొబ్బరికాయలను డొల్ల చేస్తున్న చిట్టి ప్రాణులు
- కన్నీరుమున్నీరవుతున్న రైతులు
- పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానంలో చెట్లకు స్టీలు తొడుగులు ఏర్పాటు
- ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న శాస్త్రవేత్తలు
- ఆశించిన స్థాయిలో ఫలితాలు

పెద్దాపురం-ఆంధ్రజ్యోతి

కొబ్బరి పేరు చెప్పగానే మనందరికీ గుర్తుకొచ్చేది కోనసీమ. కల్పవృక్షంలాంటి కొబ్బరిపంటపైనే ఆధారపడి అక్కడి రైతులు తమ జీవితాలను వెళ్లదీస్తుంటారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఎకరాల్లో కొబ్బరి సాగవుతుంటే అధిక భాగం కోనసీమలో విస్తరించి ఉంది. కోనసీమను కొబ్బరిసీమ అని కూడా పిలుస్తారు. ఇక్కడి కొబ్బరి రైతులకు ప్రస్తుతం ఉడతల రూపంలో కొత్త సమస్య వచ్చిపడింది. కోతులకంటే ఉడతలే కొబ్బరి తోటలను అధికంగా పాడుచేస్తున్నాయి. ఉడతలు గుంపులుగుంపులుగా వచ్చి ఇంకా ఎదగని లేత కాయలను పూర్తిగా నాశనం చేస్తున్నాయి. చూడ్డానికి చిన్నగా అమాయకంగా కనిపించే ఈ ప్రాణులు వందలాది ఎకరాల్లో కొబ్బరి తోటలను నాశనం చేస్తూ రైతులకు లక్షల్లో నష్టాన్ని మిగులుస్తున్నాయి.

కొబ్బరిని సాధారణంగా నల్లముట్టె, కొమ్ము, ఎర్రముక్కు, ఇరియోఫిడ్ నల్లి మొదలైన పురుగులు ఆశించి నష్టపరుస్తాయి. కొబ్బరి తోటల్లో పిందెలను ఉడతలు పాడుచేయడం అనేది సమస్యగా మారింది. దీంతో రైతులకు నష్టం తీవ్ర వాటిల్లుతోంది. ఉడతలు కొబ్బరి పిందెలను కొరికి, రసం పీల్చడం లేదా తినేస్తాయి. దీనిని అరికట్టడానికి గింజలను చెట్లకు కట్టడం, ఉచ్చులు పెట్టడం, విషపు ఎరలను వాడటం వంటి వాటిని సాధారణంగా రైతులు చేస్తుంటారు. ఉడతలు లేత కొబ్బరికాయలకు రంధ్రాలు చేసి లోపలంతా తినేస్తుంటాయి. దీంతో పైకి బాగానే కనిపించినా లోపల డొల్లగా మారుతుంది. ఈ సమస్యకు పరిష్కారంగా పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానంలో కొబ్బరి చెట్లకు స్టీలు తొడుగులు (గిర్డిల్స్) ప్రయోగాత్మకంగా అమర్చి ఉడతల వల్ల పంటకు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నారు.

కొబ్బరి పిందెలనే ఎందుకు పాడుచేస్తాయి..

ఉడతలు క్షీరదాలు తరగతికి చెందినవి. ప్రపంచవ్యాప్తంగా ఉడతలు 200 కంటే ఎక్కువ జాతులు ఉన్నప్పటికీ వాటిని ప్రధానంగా మూడు విభాగాలుగా వర్గీకరించారు. వాటిలో చెట్లపై నివసించేవి, నేలపై నివసించేవి, ఎగిరే ఉడతలు ఉన్నాయి. ఉడతలకు నిరంతరం ఆహారం అవసరం. ముఖ్యంగా శక్తిని ఇచ్చే కొబ్బరి పిందెలు వాటికి మంచి ఆహారం. ఉడతల సంతతి పెరిగేకొద్దీ ఆహార అవసరాలు పెరుగుతాయి. అందువల్ల అవి తోటలపై పడి దాడి చేస్తాయి. ఉడతలు శాఖాహారులు అయినప్పటికీ చాలా వరకు ఉభయచరుల్లా ప్రవర్తిస్తాయి. విత్తనాలు, గింజలు, పండ్లు, పుట్టగొడుగులు, పచ్చికాయలు, ఆకులను ఆహారంగా తీసుకుంటాయి. కొన్ని జాతుల ఉడతలు పక్షి గుడ్లు, చిన్న పెంకు పురుగులు, చిన్న సరీసృపాలను కూడా ఆహారంగా తీసుకుంటాయి. ఉడతలు ఆహారాన్ని దాచుకునే అలవాటు కలిగి ఉంటాయి. శీతాకాలం కోసం గింజలను నేలలో దాచిపెడతాయి. కొన్నిసార్లు అవి దాచిపెట్టిన స్థానాన్ని మరిచిపోవడంతో వాటి నుంచి కొత్త మొక్కలు వస్తాయి. ఆ విధంగా పర్యావరణ వ్యాప్తిలో కూడా అవి భాగస్వాములు అవుతాయి.

పక్వానికి వస్తున్న కాయలకు రంధ్రాలు..



కాయలు బాగా పెరిగి లోపల లేత కొబ్బరి గుజ్జు ఏర్పడుతున్న దశలో ఉడతలు దాడి చేస్తాయి. ఉడతలు తమ పదునైన దంతాలతో కాయలపై భాగంలో లేదా పక్క భాగంలో చిన్న రంధ్రాలు చేస్తాయి. ఇవి లోపలి గుజ్జు వరకు చొచ్చుకుపోతాయి.

వాణిజ్య విలువ తగ్గడం...

రంధ్రాలు చేయడం వల్ల కాయ పాడైపోయి నీరుగారిపోతుంది. ఈ విధంగా దెబ్బతిన్న కాయలకు మార్కెట్లో ఎలాంటి విలువ ఉండదు. ఉడతలు చేసిన రంధ్రాల ద్వారా గాలిలోని బ్యాక్టీరియా లేదా శిలీంధ్రాలు (ఫంగస్) లోపలికి ప్రవేశించి కాయ మొత్తం కుళ్లిపోవడానికి దారితీస్తుంది.

పూత నాశనం..

కొన్ని సందర్భాల్లో ఉడతలు కొబ్బరి పూతను కూడా కొరికేస్తాయి. దీంతో కాయలు కట్టే అవకాశం లేకుండా పోతుంది. ముఖ్యంగా కొబ్బరి పంటలో ఉడతల నష్టాన్ని రైతులు సరిగా గమనించకపోతే అది కేవలం పిందెలు రాలిపోవడం లేదా తెగుళ్ల కారణంగా సంభవిస్తుందని అనుకుంటారు. కానీ చాలాసార్లు దగ్గరగా పరిశీలిస్తే కొరికిన గుర్తులు లేదా రంధ్రాలు కనిపిస్తాయి.



ఉడతలు కొట్టేసిన లేత కొబ్బరికాయలు



లేత కొబ్బరి పిందెలే లక్ష్యం...

ఉడతల కారణంగా కొబ్బరిలో ప్రధానంగా పిందె దశ, పక్వానికి కాయలు వస్తున్న దశలో నష్టం కలుగుతుంది. పూత దశ దాటి కాయగా మారుతున్న లేత కొబ్బరి పిందెలను ఉడతలు లక్ష్యంగా చేసుకుంటాయి. చిన్న పిందెలను కొరికి వాటి లోపల ఉన్న మృదువైన భాగాన్ని తింటాయి. దాడి కారణంగా పిందెలు తమ పోషణను కోల్పోయి పూర్తిగా పెరగకముందే చెట్టు నుంచి రాలిపోతాయి. దీనివల్ల దిగుబడి తగ్గిపోతుంది.

నివారణ

- కొబ్బరి చెట్లకు స్టీలు తొడుగులు (గిర్డిల్స్) ఏర్పాటుచేసుకోవడం ద్వారా అవి చెట్టు ఎక్కలేక జారిపోతాయి.
- కొబ్బరి పిందెలు ఉన్న గెలలకు సన్నటి వలలు లేదా ప్లాస్టిక్ కవర్లు కట్టడం వల్ల ఉడతలు వాటిని చేరలేవు.
- ఉడతలను పట్టుకోవడానికి ప్రత్యేకమైన ఉచ్చులు ఏర్పాటుచేయాలి.
- చెట్టు కాండం చుట్టూ జింక్ షీట్లు చుట్టడం వల్ల అవి చెట్టుపైకి ఎక్కడం కష్టమవుతుంది.
- ఆహారంలో విషపు ఎర కలిపి ఉంచాలి.
- తోటల్లో గుడ్లగూబలు వంటివి ఉండేలా చూసుకోవడం వల్ల ఉడతలను నియంత్రించవచ్చు.



చర్యలు

- బోనులు పెట్టి ఉడతలను పట్టుకోవడం, పట్టుకున్న ఉడతలను తోటలకు దూరంలో, అడవి ప్రాంతంలో వదిలివేయాలి.

ఉడతలు చురుగ్గా ఉండి వేగంగా కదులుతాయి. కాబట్టి వాటిని నివారించడానికి రక్షణ కంచెలు లేదా సంప్రదాయ పద్ధతులు పనిచేయవు. వ్యవసాయ శాఖ నిపుణులు చెట్టు కాండాలకు మెటల్ షీట్లు బిగించడం లేదా వేప నూనె పిచికారీ చేయడం వంటి పద్ధతులను పాటిస్తున్నారు. అయితే ఆర్థిక స్తోమత లేని రైతులు వీటిని అవలంబించలేకపోతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టి ఉడతల నియంత్రణకు అవసరమైన సామగ్రిని రాయితీపై అందించాలని కోరుతున్నారు.

ప్రయోగాత్మకంగా స్టీలు తొడుగులు ఏర్పాటు చేశాం



ఉడతల బారి నుంచి కొబ్బరి చెట్లను రక్షించుకునేందుకు వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఉన్న కొబ్బరి చెట్లకు స్టీలు తొడుగులు ఏర్పాటుచేశాం. ప్రయోగాత్మకం అమలుతో సత్ఫలితాలు వచ్చాయి. ఉడతలు కొబ్బరి చెట్లు ఎక్కడానికి ప్రయత్నం చేసినప్పటికీ స్టీలు కారణంగా వాటి కాళ్లకు పట్టు దొరక్క కిందకు జారిపోతున్నాయి. తద్వారా కొబ్బరి పిందెలు, పువ్వులను రక్షించుకునే వీలుకలిగింది.

డాక్టర్ ఇంజేటి సుధీర్‌కుమార్, ప్రధాన శాస్త్రవేత్త
వ్యవసాయ పరిశోధనా స్థానం, పెద్దాపురం

ఉమ్మడి తూర్పులో 13న జాతీయ లోక్ అదాలత్

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: పీడీజే గంధం సునీత



రాజమహేంద్రవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ లోక్ అదాలత్‌లో రాజీకి అర్హమైన క్రిమినల్, సివిల్ కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్, ప్రమాదాలు, బ్యాంకులు, ప్రీ-లిటిగేషన్ కేసులతోపాటు ట్రాఫిక్ చలానా, ఎక్సైజ్‌కి సంబంధించి డ్యూటీపెయిడ్, నాన్ డ్యూటీ పెయిడ్ కేసులను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఇప్పటికే ఆ తరహా 18,035 కేసులను గుర్తించామన్నారు. ఉమ్మడి జిల్లాలో 46 న్యాయ పీఠాలను ఏర్పాటు చేశామన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పర్యవేక్షణలో ప్రతి మూడు నెలలకు ఒకసారి దేశవ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నారన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించడం, తక్కువ ఖర్చుతో న్యాయం అందడం, రాజీ ద్వారా చట్టపరమైన వివాదాలకు ముగింపు, రాజీపడిన కేసులకు కోర్టు ఫీజు తిరిగి ఇచ్చేయడం, ఈ తీర్పులను తుది తీర్పులుగా పరిగణించడం వల్ల ప్రజలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతుందన్నారు. 2024లో 4 జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహించగా 10,623 కేసులకు పరిష్కారం లభించిందన్నారు. బాధితులకు రూ.162కోట్ల 35లక్షల 24వేల 590 పరిహారం అందిందని చెప్పారు.అలాగే ఈ ఏడాది ఇప్పటి వరకూ జరిగిన 3 జాతీయ లోక్ అదాలత్‌లలో 17,073 కేసులకు పరిష్కారం లభించగా.. రూ.100కోట్ల 99లక్షల 11వేల 504 పరిహారాన్ని బాధితులు అందుకున్నారని పీడీజే గుర్తు చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మార్షల్ ఆర్ట్సలో ఎస్‌కేఆర్‌కు పసిడి పంట

రాష్ట్ర స్థాయి పోటీల్లో 6 గోల్డ్ మెడల్స్‌తోపాటు ఒక సిల్వర్, రెండు బ్రాంజ్ మెడల్స్ కైవశం



మెడల్స్ సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మార్షల్ ఆర్ట్(ఉషు) ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఈ నెల 8,9 తేదీల్లో జరిగిన ఇండియా స్టేట్ ఉమెన్స్ లీగ్ 2025-2026 పోటీల్లో స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు పసిడి పంట పండించారు. ఆరు గోల్డ్ మెడల్స్‌తోపాటు ఒక సిల్వర్, రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. కె.సత్యవేణి, కె.జీవన్, కె.కుసుమ, కె.మహాసుహాసిని, ఎం.భార్గవి, జి.కృష్ణవేణి గోల్డ్‌మెడల్స్ సాధించగా స్వర్ణలత సిల్వర్ మెడల్, రాజ్యలక్ష్మి, పావని బ్రాంజ్ మెడల్స్ గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ రాఘవకుమారి తెలిపారు. గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థినులు జనవరిలో ఛత్తీస్‌ఘడ్‌లో జరిగే నేషనల్ ఉమెన్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొంటారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థినులను ఆమె అభినందించారు.

13న 1008 మందితో వందేమాతరం గీతాలపన



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న తోట సుబ్బారావు

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నేటి తరం విద్యార్థుల్లో తెలుగు భాష పట్ల మమకారం పెంచేందుకు 1008 మంది విద్యార్థులతో శతక పద్య సహస్రాధిక గళ ధారణ, వందేమాతర గీతాలాపన కార్యక్రమం, పెరవలి మాతృభాషా పరిరక్షణ సమితి, ఆంధ్ర కేసరి యువజన సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గోదావరి గట్టున ఉన్న చాంబర్ భవనంలో జరుగుతుందని సమన్వయకర్తలు సీహెచ్‌సీ నాగభూషణం, దేశిరెడ్డి బలరామనాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని సరస్వతీ ఘాట్‌లో ఆధ్యాత్మికవేత్త తోట సుబ్బారావు బుధవారం ఆవిష్కరించారు.కార్యక్రమంలో మాదిరాజు శ్రీనివాస్, దూర్వాసుల సత్యనారాయణ, రఘుపాత్రుని సాయిబాబా పాల్గొన్నారు.

ఘనంగా కేశవస్వామి పవిత్రోత్సవాలు



మహాసనపం నిర్వహిస్తున్న పండితులు

ఆత్రేయపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పురాన ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు రెండో రోజు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పవిత్రోత్సవ పూజలు, ఉత్సవమూర్తులకు మహాస్నపనం, శాంతి హోమం, సాయంత్రం పంచపవిత్రాల ఊరేగింపు, పంచ సయ్యాధివాసం, మహాశాంతి హోమం తదితర కార్యక్రమాలను వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం శ్రీనివాసుల వెంకటాచార్యుల బ్రహ్మత్వంలో నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఈవో బీహెచ్‌వీ రమణమూర్తితోపాటు అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఎస్ఐఎఫ్‌టీలో సిలబస్ మార్పునకు కమిటీ

కాకినాడ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురంలోని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (ఎస్ఐఎఫ్‌టీ)లో ప్రస్తుతం కొనసాగుతున్న కోర్సులపై మూల్యాంకనం చేపట్టి కొత్తగా సిలబస్ రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర మత్స్య శాఖ జీవోఆర్‌టీ నెంబర్ 414 జారీ చేసింది. ఈ కమిటీకి ఛైర్మన్‌గా ఫిష రీస్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ వ్యవహరించనున్నారు.మెంబర్ కమిటీ కన్వీనర్‌గా ఎస్ఐ ఎఫ్‌టీ ప్రిన్సిపాల్ కొనసాగుతారు.కమిటీలో సభ్యులుగా 9 మందిని నియమించగా, అందులో కాకినాడ నుంచి ఎఫ్ఆర్ఎస్ ఓఎస్‌డీ సభ్యుడిగా ఉన్నారు.ఈ కమిటీ ఎస్ఐఎఫ్‌టీలో 6 నెలల కోర్సులకు సంబంధించి సమీక్షలు జరిపి మార్పులు,చేర్పులు సూచించనుంది.

డ్రంకెన్ డ్రైవ్‌కు మూడ్రోజుల జైలు

బిక్కవోలు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులో ఇటీవల నిర్వహించిన వాహనాల తనిఖీల్లో గ్రామానికి చెందిన జమ్ము శివ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. దీంతో అతడిని బుధవారం అనపర్తి జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చగా మూడు రోజులు జైలు శిక్ష విధించారన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోటి బిల్వార్చన



వేద పండితుడు కృష్ణమూర్తిని సత్కరిస్తున్న స్పీకర్ అయ్యన్న, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వేగుళ్ల, గోరంట్ల, ఎమ్మెల్సీ సోము

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- పెదపర్తిలో ముగిసిన పూజలు
- పార్వతీరామలింగేశ్వరుల కల్యాణం

అనపర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్న కాంక్షతోనే కోటి బిల్వార్చన నిర్వహించినట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. అనపర్తి మండలం పెదపర్తిలోని పార్వతి రామలింగేశ్వర స్వామి ఆలయంలో వేద పండితుడు యలమంచిలి కృష్ణమూర్తి నేతృత్వంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో 41రోజుల పాటు రుద్రయాగ, నవ చండీయాగ, నవగ్రహ యాగ సహిత మహా కోటి బిల్వార్చన, కుంకుమార్చనలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల చివరి రోజైన బుధవారం ఉదయం నుంచి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో అయ్యన్న పద్మావతి దంపతులతో బాటు ఆయన కుమారులు కోడళ్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పార్వతి రామలింగేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రం దొంగలపాలైందని ప్రస్తుతం ప్రగతి పథంలో పయనిస్తుందని, రాబోయే రోజుల్లో దుష్ట శక్తుల పాలు కాకుండా కాపాడాలని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధాని మోదీ, రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వంటి నేతలు క్షేమంగా ఉండాలని ఈ కార్యక్రమాలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేద పండితుడు యలమంచిలి కృష్ణమూర్తిని అయ్యన్నతోపాటు, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజుల చేతుల మీదుగా సత్కరించారు. అలాగే వేద పండితులను సన్మానించారు. అనంతరం అయ్యన్నను ఎమ్మెల్యే నల్లమిల్లి సత్కరించి మెమొంటోను అందజేశారు.కార్యక్రమంలో ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్, వైస్ ఛైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి, ఏఎంసీ ఛైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రొయ్యల ఎగుమతుల్లో కాకినాడ-గోదావరి కీలకం

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు



కాకినాడ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రొయ్యల ఉత్పత్తిలో ముఖ్య కేంద్రంగా నిలిచిన కాకినాడ-గోదావరి ప్రాంతం ఎగుమతుల్లో మరింత కీలక పాత్ర పోషించనుందని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పేర్కొన్నారు. దేశంలో ఆక్వా రంగం వృద్ధి,మార్కెట్ విస్తరణ, మత్స్యకారుల ఆర్థిక బలోపేతం, దక్షిణ భారత ఆక్వా ఉత్పత్తుల తక్షణ రవాణా సౌకర్యాల ప్రాముఖ్యతపై బుధవారం రాజ్యసభలో ఎంపీ సతీష్‌బాబు అడిగిన ప్రశ్నకు కేంద్రం సమగ్ర నివేదిక అందించింది. 2024-25లో భారత్ రూ.62.408 కోట్ల విలువైన 16.98 లక్షల టన్నుల సముద్ర ఆహార ఉత్పత్తులను 130 దేశాలకు ఎగుమతి చేసిందని కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ వెల్లడించారు. కొత్త మార్కెట్ల విస్తరణ, విలువ జోడింపుపై కేంద్రం చేపట్టిన చర్యల వల్ల కాకినాడ నుంచి రొయ్యల ప్రాసెసింగ్, ఎగుమతి యూనిట్లకు అవకాశాలు పెరగనున్నాయని తెలిపారు. జీఎస్టీ తగ్గింపుతో విలువ ఆధారిత ఉత్పత్తులకు, స్థానిక ప్రాసెసింగ్ యూనిట్లకు లాభం చేకూరే అవకాశం ఉందన్నారు. కొత్త మార్కెట్ల విస్తరణకు ఎంపెడా ద్వారా అవగాహన కార్యక్రమాలు, కొనుగోలు- అమ్మకందార్ల సమావేశాలు, విలువ జోడింపుపై శిబిరాలు నిర్వహిస్తున్నట్టు కేంద్ర మంత్రి వెల్లడించారు.

వందేమాతరం చర్చలో.. వందేమాతరం గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఎంపీ సతీష్‌బాబు ప్రసంగించారు. ఆయన వందేమాతరం గీతం చరిత్ర, భారత స్వాతంత్ర్య సమరంలో దాని పాత్ర, తన స్వస్థలం కాకినాడతో ఉన్న అనుబంధాన్ని వివరించారు. బకించంద్ర చటర్జీ రచించిన ఈ గీతం స్వాతంత్ర్య ఉద్యమంలో లక్షలాది మందికి ప్రేరణగా నిలిచిందన్నారు. కాకినాడలో 1923లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభల్లో వందేమాతరం గీతంపై అభ్యంతరంతో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మౌలానా మహమ్మద్ అలీ జౌహర్ బయటకు వెళ్లిపోవడం బాధాకర అధ్యాయంగా మిగిలిందన్నారు. అదే ఘటనకు శతాబ్దం తర్వాత చరిత్ర ఇచ్చిన సమాధానంగా ఈ ఏడాది నవంబరు 7న కాకినాడలోని మౌలానా మహమ్మద్ అలీ వీధికి వందేమాతరం మార్గ్ అని పేరు పెట్టిన విషయాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. సీఎం చంద్రబాబు తనకు ఈ చర్చలో మాట్లాడే అవకాశం కల్పించారని సతీష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

అంతర కళాశాలల ఫుట్‌బాల్ విజేతగా కాకినాడ ఐడియల్



ఫుట్‌బాల్ ట్రోఫీతో ఐడియల్ కళాశాల విద్యార్థులు

కాకినాడ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర కళాశాలల ఫుట్‌బాల్ విజేతగా కాకినాడ ఐడియల్ కళాశాల విద్యార్థులు ట్రోఫీని కైవసం చేసుకున్నారు. రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10వ తేదీల్లో నిర్వహించిన అంతర కళాశాలల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఐడియల్ కళాశాల జట్టు పాల్గొంది. బుధవారం జరిగిన ఫైనల్ పోటీలో ఐడియల్ కాలేజీ విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరచడంతో ప్రథమ స్థానం సాధించి అంతర కళాశాలల ఫుట్‌బాల్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ జట్టు సభ్యులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పీఎస్ఎస్ కిరణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సత్యనారాయణ, డైరెక్టర్స్ ఎం.రంజిత్, కేఎస్ వాసు, పీడీ పెమ్మాడి శ్రీను క్రీడాకారుల్ని అభినందించారు.



క్రీడా సంబరం...

- జేఎన్టీయూకేలో సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలు
- ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు
- కాకినాడ జిల్లాలో 3చోట్ల టోర్నమెంట్
- ఈ నెల 14 వరకూ నిర్వహణ
- మొదటి రోజు 40 మ్యాచ్‌లు



బెలూన్లు వదిలి పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

జేఎన్టీయూకే, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో అసోషియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏఐయూ) సహకారంతో వర్శిటీ మైదానంలో సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జేఎన్టీయూకే, సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల, అచ్చంపేటలోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ సంయుక్తంగా నిర్వహించే వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రభుత్వ విప్, విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే, ఏపీ వాలీబాల్ సంఘ అధ్యక్షులు, వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు పి.గణవెంకట రెడ్డినాయుడు(గణబాబు) ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. వర్శిటీ క్రీడా మైదానంలో ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, అర్జున అవార్డు గ్రహీత, మాజీ అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు పి.వెంకటరమణ, గౌరవ అతిథులుగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ఏఐయూ పరిశీలకులు డాక్టర్ ఈ.త్రిమూర్తులు హాజరయ్యారు. ఈనెల 14 వరకూ జరిగే ఈ టోర్నమెంట్‌లో సుమారుగా 138 జట్లు పాల్గొంటున్నాయి. పోటీలను 4పూల్స్‌గా విభజించారు. పూల్ ఏ, బీ పోటీలు జేఎన్టీయూకే మైదానంలో, పూల్ సీ పోటీలు అచ్చంపేటలోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ క్యాంపస్‌లో, పూల్ డీ లోని జట్లకు సంబంధించిన పోటీలు సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్నాయి. జ్యోతి ప్రజ్వలన అనంతరం అతిథులు జాతీయ జెండాను, క్రీడాపతాకాన్ని ఆవిష్కరించి పోటీల్లో పాల్గొంటున్న జట్ల క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

ఉత్తమ ప్రతిభ కనబరచాలి...

కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ క్రీడాకారులకు అభినందనలు తెలిపి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కాకినాడ జిల్లాలో ఎంతో సుందరమైన టూరిస్టు ప్రదేశాలు ఉన్నాయని తెలిపారు. ఎస్పీ మాట్లాడు తూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ క్రీడాకారులు తమపై తాము నమ్మకం ఉంచుకుని బాగా రాణించినపుడే విజయం సాధించవచ్చని తెలిపారు. వీసీ మాట్లాడుతూ కాకినాడ జేఎన్టీయూకే వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహణ బాధ్యతలను అప్పగించిన ఏఐయూకు కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులు, అధికారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. టోర్నమెంట్‌లో మొదటిరోజు 40మ్యాచ్‌లు జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ సుబ్బారావు, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, ఓఎస్డీ కోటేశ్వరరావు, వర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి, టోర్నమెంట్ కన్వీనర్ డాక్టర్ జి.శ్యామ్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ జీపీ రాజు, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయభాస్కర్, మాజీ వీసీలు ప్రసాదరాజు, పద్మరాజు డైరెక్టర్లు కృష్ణమోహన్, బీటీ కృష్ణ, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, పీడీలు వెంకటేశ్వరరావు ఉన్నారు.

క్రమశిక్షణ అవసరం...

ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తితో ఆడి ఉత్తమ ప్రతిభ చూపాలన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుం చి వచ్చిన క్రీడాకారులు, జట్ల మేనేజర్లకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా జేఎన్టీయూకే ఆధ్వర్యంలో అన్ని సదుపాయాలు కల్పించడం జ రిగిందన్నారు. క్రీడాకారులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని దీని ద్వారా చదువులోనూ, క్రీడల్లోనూ రాణించగలరని తెలిపారు. వెంకటరమణ మాట్లాడుతూ వాలీబాల్ క్రీడాకారులు కష్టపడి ఆడుతూ క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. అంతేకాకుండా కష్టపడి ఆడినవారు ఎప్పటికైనా విజయం సాధిస్తారన్నారు.





వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న అధికారులు



ఆహారం రెడీమేడ్!

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

పక్షులకు ఆహారం పెట్టడానికి ధాన్యం కుచ్చులను ఇళ్ల వద్ద ఏర్పాటు చేస్తుంటారు. అయితే వాటిని రెడీమేడ్ దుస్తుల్లా సిద్ధం చేసి అమ్మేస్తున్నారు. కాకినాడలో సైకిల్‌కు ధాన్యం కుచ్చులను తగిలించి విక్రయాలు చేస్తున్న దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి కెమెరా' క్లిక్ మనిపించిందిలా...

అన్నవరం దేవస్థానం ఈవోగా త్రినాథరావు బాధ్యతల స్వీకరణ

భక్తులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని ఆలయ సిబ్బందికి సూచన

అన్నవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం నూతన ఈవోగా నియమితులైన వేండ్ర త్రినాథరావు బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా స్వామిని దర్శించుకున్న ఆయన అనివేటి మండపంలో ఇప్పటివరకు ఈవోగా ఉన్న వీర్ల సుబ్బారావు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు సుబ్బారావుకు వీడ్కోలు పలికి త్రినాథరావుకు స్వాగతం పలికారు. అనంతరం ఈవో కార్యాలయంలో త్రినాథరావు సిబ్బందితో సమావేశమయ్యారు. గతంలో మూడు పర్యాయాలు అన్నవరం దేవస్థానం ఈవోగా పనిచేసిన అనుభవంతో సిబ్బందితో ఎటువంటి పరిచయ కార్యక్రమం లేకుండానే పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ సర్వేలో భక్తుల అసంతృప్తి శాతం అధికంగా ఉండడంతో అన్నవరం దేవస్థానం ఆరోస్థానానికి పరిమితమయిన సంగతి తెలిసిందే. అయితే భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ వారి సందేహాలను విసుగుచెందకుండా నివృత్తి చేయాలని, సిబ్బంది సమష్టిగా పని చేస్తే మొదటిర్యాంక్ రావడం పెద్ద కష్టమేమీ కాదని సూచించారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు, ఈఈ రామకృష్ణ, పీఆర్వో అనకాపల్లి ప్రసాద్, ఏఈవోలు సూపరెంటెండెంట్‌లు పాల్గొన్నారు.



ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న త్రినాథరావు

బైక్‌లు కొట్టేసి... డబ్బులతో జల్సాలు చేసి!

రాజమహేంద్రవరంలో ముగ్గురు దొంగల అరెస్ట్

రూ.17.40 లక్షల విలువైన 29 ద్విచక్రవాహనాల స్వాధీనం





వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్... నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేస్తున్న ద్విచక్రవాహనాలు

రాజమహేంద్రవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం నగరానికి వచ్చాడు. చిన్న పనిలో కుదిరాడు. కష్టపడుతూ బతుకుతున్నాడు. ఓ రోజు బైక్ నడపాలనే కోరికతో మారుతాళంతో ప్రయత్నించగా ఫలించింది. డబ్బులు బాగా వస్తుండడంతో బుద్ధి వక్రించి ద్విచక్ర వాహనాల దొంగగా మారాడు. ఆ డబ్బులతో జాల్సాలు చేశాడు. ఆపై పోలీసులవలకు చిక్కడంతో అతడితోపాటు దొంగతనం చేసిన వాహనాలు కొనుగోలు చేసిన ఇద్దరిని కటకటాల్లోకి నెట్టారు. బుధవారం సెంట్రల్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ వివరాలను వెల్లడించారు.

హోటల్‌లో నైట్‌బాయ్‌గా చేరి...

తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరుపేటకు చెందిన సబ్బు వీరబాబు చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. అమ్మమ్మ దగ్గర పెరిగాడు. తర్వాత రాజమహేంద్రవరం వచ్చి పుష్కర్‌ఘాట్ సమీపంలోని ఓ హోటల్‌లో నైట్‌బాయ్‌గా ఉద్యోగంలో చేరాడు. పగలు వెల్డింగ్ పనులకు వెళ్లేవాడు. అయితే ఒక రోజు బైక్ నడపాలని అనుకున్నాడు. కానీ కొనుక్కొనే పరిస్థితి లేదు. దీంతో పుష్కర్ ఘాట్ వద్ద పార్క్ చేసిన ఓ మోటార్ సైకిల్‌ని మారు తాళంతో ప్రయత్నించగా పని జరిగింది. కొంత కాలం ఆ బైక్‌ని వాడుకున్నాడు. తర్వాత స్నేహితులైన కోసూరి పవన్ కుమార్, జర్గాని అప్పన్నకు అమ్మేశాడు. ఆ డబ్బులతో జల్సాలు చేశాడు. అదే పని బాగుందనుకుని ద్విచక్ర వాహనాల దొంగగా మారాడు. పుష్కర్‌ఘాట్, కోటగుమ్మం, మల్లయ్యపేట, సుబ్రహ్మణ్య మైదానం, లాలాచెరువు రోడ్, ఇస్కాన్ దేవాలయం, వాడపల్లి గుడి ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను దొంగిలించాడని డీఎస్పీ వివరించారు. వీరబాబుతో పాటు కొయ్యూరు మండలం మఠం భీమవరం గ్రామానికి చెందిన పవన్‌కుమార్, గోకవరం మండలం అచ్యుతాపురానికి చెందిన అప్పన్నని అరెస్టు చేసి రూ.17.40 లక్షల విలువైన 29 ద్విచక్ర వాహనాల స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ద్విచక్ర వాహనాలకు యజమానులు వీల్ లాక్‌లు, జీపీఎస్‌లు అమర్చుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని త్రీటౌన్ సీఐ వీ.అప్పారావు సూచించారు. దొంగలను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐ వి.అప్పారావు, ఎస్ఐ ఎండీ జుబేర్, హెచ్‌సీలు వీ.కృష్ణ, ఎస్.వెంకట రామయ్య, ఎస్.చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు బి.విజయ్ కుమార్, కె.పవన్ కుమార్, ఆర్.సుబ్రహ్మణ్యాన్ని ఎస్పీ నరసింహకిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.

రత్నగర్భ గణపతి ఆలయంలో చోరీ

రూ.10 లక్షల విలువైన 7 కిలోల వెండి ఆభరణాలు దోచుకెళ్లిన దుండగులు



ఆలయం వద్ద పరిశీలిస్తున్న ఎస్ఐ మౌనిక

పెద్దాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం ఆర్‌బీ పట్నంలోని రత్నగర్భ గణపతి ఆలయంలో బుధవారం భారీ చోరీ జరిగింది. రాఘవమ్మ చెరువు గట్టు సమీపంలో ఉన్న ఈ ఆలయాన్ని గ్రామస్తులు పునర్నిర్మించారు. మంగళవారం అర్ధరాత్రి ఆలయంలోకి దొంగలు చొరబడి స్వామివారికి కిరీటం, కలశం, చిన్న వినాయక విగ్రహం దోచుకెళ్లినట్టు గ్రామస్తులు తెలిపారు. స్వామివారికి నిత్యం అలంకరించబడి ఉండే 7 కిలోల వెండి వస్తువులు విలువ సుమారు రూ. 10 లక్షల వరకూ ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. దాతలు సమకూర్చిన ఈ వెండి ఆభరణాలు చోరీకి గురికావడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. అలాగే ఈ చోరీ విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎస్ఐ వి.మౌనిక సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. ఆలయంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో సమీపంలో ఉన్న సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పోలీసు జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకుల దాడి



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

రంపచోడవరం/గంగవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా గంగవరం మండలంలో టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకులు బుధవారం సాయంత్రం కత్తితో దాడి చేసి గాయపర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. పిడతమామిడి గ్రామానికి చెందిన రెడ్డి వేణుగోపాల్ రెడ్డి టీడీపీ కార్యకర్త. పంచాయితీ ఎన్నికలకు అందరినీ సన్నద్ధం చేస్తున్న పరిణామంలో స్థానికంగా ఉండే వైసీపీ నాయకులకు ఓర్వలేక వేణుగోపాలరెడ్డితో ఘర్షణకు దిగారు. యెజ్జు వెంకటేశ్వరరావు, యెజ్జు రామకృష్ణ, తుమ్మల చిట్టిబాబు, బలిజ వీరబాబు, జగ్గు నూకరాజు వేణుగోపాలరెడ్డిపై దాడి చేసి గాయపర్చారు. రామకృష్ణ కత్తితో దాడి చేయగా వేణుగోపాలరెడ్డి చేతికి గాయమైంది. దీంతో ప్రాణాలను కాపాడుకోవడానికి అక్కడి నుంచి పారిపోయి, పిడతమామిడి పీహెచ్‌సీకి చేరుకుని వైద్యం అనంతరం దాడి విషయాన్ని మండలంలో టీడీపీ నాయకులకు అందించారు. వారు బాధితుడ్ని రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి బుధవారం రాత్రి బాధితుడ్ని పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాధ్యులపై తగు చర్యలను తీసుకోవాలని పోలీసులను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ ఎదుగుదలను సహించలేని వైసీపి ఎమ్మెల్సీ అనంతబాబు తన నాయకులతో ఇటువంటి దాడులకు పురిగొల్పుతున్నాడన్నారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలను తీసుకుని తమ కార్యకర్తలకు, నాయకులకు అండగా నిలుస్తామని తెలిపారు.

స్విమ్మింగ్ పోటీల్లో యానాం విద్యార్థికి కాంస్యం



తోటి క్రీడాకారులతో వెంకటనాగసాయి

యానాం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రపంచస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యానాంశాఖ విద్యార్థి ప్రతిభ చాటి కాంస్య పతకం కైవసం చేసుకున్నాడని సెంటర్ ఇన్‌చార్జ్ ఉదయ్‌కుమార్ తెలిపారు. సౌత్ ఆఫ్రికాలోని మోసల్‌బే జరిగిన యూఐపీఎమ్ బైతేల్-ట్రైతేల్ లెజర్ వరల్డ్ చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో అండర్-15 విభాగంలో యానాం సాయ్ విద్యార్థి వీసం వెంకటనాగసాయి ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించాడని పేర్కొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

గండేపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మండలంలోని మురారిలో బుధవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు తెలిపారు. మృతదేహంపై ఎటువంటి దెబ్బలు లేవన్నారు. వయస్సు 70 ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచామని ఆచూకీ తెలిసిన వారు 9440904841, 9440796529లో సంప్రదించాలని కోరారు.




సూసేకి అగ్గిరవ్వ మాదిరి...



సూరీడు.. అగ్గిరవ్వ మాదిరి కనిపించాడు. శివలింగంపై ఎర్రటి తేజస్సును కురిపించాడు. గోదావరిపై తన కాంతిని ప్రసరింపజేశాడు. రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద కనిపించిన ఈ అద్భుతమైన దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి కెమెరా' ఒడిసిపట్టిందిలా...

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం





చెట్లను కొట్టేయాల్సిందేనా?

సజీవంగా వేరే ప్రాంతాలకు తరలించవచ్చంటున్న స్థానికులు

అటవీశాఖ అధికారులు చొరవ చూపాలని అభ్యర్థన



చెట్లను నరికి కలపను వ్యాన్‌పై తరలిస్తున్న దృశ్యం

ఆలమూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి కూరగాయల మార్కెట్ నుంచి చొప్పెల్ల లాకుల వరకు 3.1కిలోమీటర్ల సర్వీసు రోడ్డు నిర్మిస్తున్నారు. దీని నిమిత్తం ఈ రోడ్డులో హైవే పక్కగా ఉన్న వివిధ వయసుల్లో ఉన్న 96 చెట్లను నరికివేస్తున్నారు. దీనికి నేషనల్ హైవే అధికారుల అభ్యర్ధనకు అటవీశాఖ అధికారులు అంగీకరించారు. వీటి తొలగింపునకు ధరలు నిర్ణయించి అనుమతులు ఇచ్చారు. ఆ ప్రకారం ఎన్‌హెచ్ అధికారులు వేలంపాటలు నిర్వహించి చెట్లు తొలగించడానికి ఒక వ్యక్తి అప్పగించారు. వా టిని ముక్కలుగా నరికి కట్టెలుగా మాత్రమే తరలించాలని అధికారులు ఆదేశించారు. కళ్ల ముందు పెరిగిన చెట్లను ఇలా నరికేయడం బాధ కలిగిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని సజీవంగా వేరేచోటకు తరలించి బతికించవచ్చని, కడియం నర్సరీ రైతులు ఈ తరహాలో ప్రత్యేక యంత్రాలతో సజీవంగా వేరే ప్రాంతాలకు తరలిస్తున్నా రని వారు చెప్తున్నారు. కానీ ఇలా సజీవంగా చెట్లు తరలించడానికి వాల్టా చట్టం ఒప్పుకోదని, అందువల్ల ఎవరూ వీటిని తరలించే ఏర్పాటు చేయొద్దని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. పైగా, ఇలా అనుమతి ఇస్తే నర్సరీల వాళ్లు ఇతర ప్రాంతాల్లో కూడా చెట్ల ను తరలిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. అలా ఐతే, అటవీశాఖ అధికారుల పర్యవేక్షణలోగానీ, వేరే ఇతర సంస్థలకు అప్పగించి గానీ చెట్లను సజీవంగా ఇతర ప్రాంతాలకు తరలించి బతికించాలని వాటితో అనుబంధం ఉన్న స్థానికులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ బొర్రా పూజలు

అంతర్వేది, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి బుధవారం విచ్చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం అనంతరం అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు.

హక్కుల రక్షణకు కోర్టులు

రాజోలు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవ హక్కులు, సహజ హక్కులు, వాటిని రక్షించడానికి, కాపాడడానికి కోర్టులు ఉన్నాయని రాజోలు సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలరాణి అన్నారు. రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మానవహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు కృషి: ఎమ్మెల్యే

ఉప్పలగుప్తం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి సీఎస్ఎం అండ్ ఎంఎస్ఎస్ కళాశాల ఆవరణలో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని అమలాపురం ఎమ్మెల్యే, కళాశాలల పాలక వర్గ డైరెక్టర్ అయితాబత్తుల ఆనందరావు అన్నారు. సీఎస్ఎం జూనియర్ కళాశాల రజతోత్సవ వేడుకలు బుధవారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్, సీనియర్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ (కిమ్స్, హైదరాబాదు) చిక్కం ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యదర్శి చిక్కం వెంకటేశ్వరరాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో పేద విద్యార్థుల కోసం నామమాత్రపు ఫీజులతో 2001లో చిక్కం సత్తిరాజు అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో నెలకొల్పిన సీఎస్ఎం కళాశాల పాతిక సంవత్సరాల్లో



మెరిట్ విద్యార్థులకు నగదు, జ్ఞాపికలు బహూకరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఎంతో మంది నిరుపేద విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలిపిందన్నారు. మెయిన్ రోడ్డు నుంచి కళాశాలకు రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తానన్నారు. సంవత్సర కాలంలో కళాశాలను మరింత ఉన్నత స్థాయిలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. అన్నదాన సత్రానికి 30ఎకరాల భూమి ఉన్నందున వ్యవసాయ కళాశాల సాధ్యపడుతుందన్నారు. చైర్మన్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి దాతల సహకారం అవసరమన్నారు. కళాశాల తొలి ప్రిన్సిపాల్ గోకరకొండ నాగేంద్ర మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, నిమ్మకాయల జగ్గయ్యనాయుడు, గొల్లవిల్లి గ్రామస్తుల కృషి ఉందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందించారు. తొలుత అన్నదానం సత్రం వ్యవస్థాపకుడు చిక్కం సత్తిరాజు విగ్రహానికి ఎమ్మెల్యే ఆనందరావు, కళాశాల పాలకవర్గం పూలమాలలువేసి నివాళి అర్పించారు. చైర్మన్ ఉమామహేశ్వరరావుతో పాటు పలువురు దాతలు రూ.32లక్షల విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, కూటమి నాయకులు, వివిధ గ్రామాల ప్రముఖులు, తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

ప్రసవంలో గర్భిణుల మరణాలు నివారించాలి

అమలాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గర్భిణులు ప్రసవ సమయంలో మరణాలు సంభవించకుండా వైద్యశాఖ అధికారులు నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన మాతా శిశు మరణాల రేటు, ప్రసవ సమయంలో గర్భిణుల మరణాలపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రసవ సమయంలో ఐదుగురు గర్భిణులు ఇటీవల మరణించినట్టు గుర్తించామన్నారు. ఈమరణాలు సంభవించడానికి గల కారణాలు అన్వేషించి పూర్తిస్థాయి నివేదికను అందించాలని వైద్యులను ఆదేశించారు. ఆసుపత్రిలో మరణాల రేటు తగ్గించేందుకు



వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

వైద్యులు అన్నివిధాలా పాటు పడాలని సూచించారు. ప్రసవ సమయంలో గర్భిణి మరణం పెద్ద ప్రజారోగ్య సమస్యగా గుర్తించాలన్నారు. గర్భధారణ, ప్రసవ నిర్వహణలో వైద్యులు సకాలంలో సేవలు అందించకపోవడం, సంక్లిష్టతలను ముందుగా గుర్తించి మెరుగైన వైద్య సేవలు ఉన్నచోటుకు వారిని తరలించాలన్నారు. శిక్షణ పొందిన వైద్యుల పర్యవేక్షణలో తప్పనిసరిగా ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. హైపర్ టైన్షన్, అధిక రక్తపోటు, తలనొప్పి, కాళ్ల వాపు వంటి వ్యాధులపై పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సమయాల్లో శస్త్రచికిత్స సదుపాయాలు ఉపయోగించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో దుర్గారావుదొర, డీసీహెచ్ఎస్ కార్తీక్, డాక్టర్ భరతలక్ష్మి, డాక్టర్ సుమలత, ప్రైవేటు ప్రసూతి వైద్యులు గిరిజ, శారద, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజీ నో..కాంప్రమైజ్ చిత్రం షూటింగ్



గుద్దాయిలంకలో షూటింగ్‌లో పాల్గొన్న హీరో రాంకీ, హీరోయిన్ జయశ్రీ

పి.గన్నవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కోనసీమలోని పల్లెల అందాలను రాజీ నో కాంప్రమైజ్ చిత్రం ద్వారా దర్శకుడు గెద్దాడ సత్య వెంకట్ తెరకెక్కిస్తున్నారు. 70శాతం చిత్రీకరణ కోనసీమలో తీయనున్నట్టు తెలిపారు. బుధవారం నాగుల్లంక శివారు గుద్దాయిలంకలో హీరో, హీరోయిన్‌తో సాగే షోలో సాంగ్‌కు సంబంధించి వరి చేలు, రోడ్లపై పలు సన్నివేశాలను దర్శకుడు వెంకట్, కొరియోగ్రాఫర్ స్వర్ణ చిత్రీకరించారు. ఈసందర్భంగా నిర్మాత, చిత్ర హీరో రాంకీ మాట్లాడుతూ రాజీ నో కాంప్రమైజ్ చిత్రం కోనసీమలో ప్రారంభించామని, 70శాతం చిత్రీకరణ రాజోలు, అమలాపురం పరిసర ప్రాంతాల్లో, 30శాతం బెంగళూరు, హైదరాబాద్‌లో జరుగుతుందని చెప్పారు. ఈచిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా ఎం.శ్రీదేవి, హీరోయిన్‌గా జయశ్రీ, ముఖ్య తారాగణంగా రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, జబర్దస్ టీమ్ అశోక్, రాము తదితరులు నటిస్తున్నారని చెప్పారు. ఈచిత్రంలో ఐదు పాటలు ఉంటాయని, వీటిని దేవవరపు నీలకంఠ రాశారని, గోదావరి, ఆనంద్, చందమామ ఫేమ్ కె.ఎం.రాధాకృష్ణ ఈచిత్రానికి సంగీతం అందిస్తున్నారని చెప్పారు. ఎడిటర్ శ్రీవర్కల, కెమెరామెన్‌గా కార్తీక్ పని చేస్తున్నారు. హీరోహియిన్‌కు తెలుగులో ఇది మొదటి సినిమా, ముంబాయి నుంచి వచ్చిన జయశ్రీ హిందీ, అస్సాం బాషల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా పలు సినిమాల్లో నటించారు. హీరో రాంకీకి ఇది మూడో సినిమా. మొదటి సినిమా గంగపుత్రులు, రెండోది జర్నలిస్టు. గంగపుత్రులు సినిమాకు రాంకీకి నంది అవార్డు వచ్చింది.

స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలు బహూకరణ

మలికిపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గూడపల్లిపల్లిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. కోరుకొండ రవి, నల్లి రవివరాజు, కలిగిత రాజు, మాజీ చైర్మన్ దొంగ ఏడుకొండలు, ప్రస్తుత చైర్మన్ కొల్లు శేషారావు, రేకపల్లి వెంకటేశ్వరరావులు రూ.25వేలువిలువైన దేశ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రసిద్ధి కవులు, శాస్త్రవేత్తల చిత్రపటాలను పాఠశాలకు బహూకరించారు. పూర్వ విద్యార్థులను సర్పంచ్ పెచ్చెట్టి నరసింహస్వామి, ఎంపీటీసీ కొల్లు నరసింహారావు, హెచ్ఎం ఆచంట రామచంద్రరావు అభినందించారు.

ఇంటర్ ఫలితాలే విద్యార్థులకు పునాది : ఆర్డీవో మాధవి

అమలాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు విద్యార్థుల జీవితాలకు బేస్‌గా నిలుస్తాయని ఆర్డీవో కె.మాధవి అన్నారు. బుధవారం అమలాపురంలోని వడ్డిగూడెం సాంఘిక సంక్షేమశాఖ కళాశాల వసతిగృహంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆసక్తితో విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తూ ఉన్నత చదువులను చదివి మంచిపేరు సంపాదించాలని విజ్ఞప్తి చేశారు. ఎంచుకున్న గోల్స్‌ను ఆత్మవిశ్వాసంతో సాధించేందుకు ముందుకు సాగాలన్నారు. మోడల్ టెస్ట్‌లకు స్పష్టమైన ప్లానింగ్‌తో ఒత్తిడి లేకుండా ప్రిపేర్ కావాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్, సాంఘిక సంక్షేమశాఖ సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి, వసతిగృహ ఉపాధ్యాయులు, అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

అంబాజీపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పసుపల్లి పరిధిలో యార్లగడ్డవారిపేటలో బుధవారం తాటాకిల్లు దగ్ధమైంది. రూ.5లక్షలు ఆస్తినష్టం ఏర్పడింది. గ్యాస్‌సిలిండర్ నుంచి వ్యాపించిన మంటలతో యార్లగడ్డ వెంకట్రావుకు చెందిన తాటాకిల్లు పూర్తిగా అగ్నికిఆహుతైంది. గృహోకరణాలు, రూ.60 వేల నగదు కాలిపోయాయిఅమలాపురంఅగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు.

అంకితభావంతో అందించే సేవలతోనే గుర్తింపు



సలీంబాషాను సత్కరిస్తున్న ప్రస్తుత డీఈవో నాగేశ్వరరావు, డీటీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో

ముమ్మిడివరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విధి నిర్వహణలో బదిలీ సర్వసాధారణమైందని, ప్రతీ ఉద్యోగి అంకిత భావంతో అందించే సేవలే ఆ ఉద్యోగికి గుర్తింపునిస్తాయని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాస్, వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి దుర్గారావుదొర పేర్కొన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాలలో బదిలీపై వెళుతున్న డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషాకు బుధవారం ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశంలో వారు పాల్గొన్నారు. డీఈవో కార్యాలయ ఏడీ నక్కా సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వక్తలు పాల్గొని మాట్లాడారు. విధి నిర్వహణను కర్తవ్యం భావించే వారు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకుంటారని, ఆ కోవలో డీఈవో సలీంబాషా అగ్రస్థానంలో నిలుస్తారన్నారు. ప్రస్తుత డీఈవో పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో విద్యాశాఖను పరుగులు పెట్టిస్తూ విద్యాభివృద్ధికి సలీం చేసిన స్ఫూర్తిదాయక సేవలు చిరస్మరణీయమన్నారు. సమావేశంలో డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు, ఉప విద్యాశాఖాధికారులు రామలక్ష్మణమూర్తి, సూర్యప్రకాశరావు, జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం, సమగ్రశిక్ష ఏఎంవో పి.రాంబాబు తదితరులు డీఈవో భాషాను ప్రశంసలతో ముంచెత్తారు. అనంతరం ఉద్యోగులంతా సలీంబాషానుసన్మానించి జ్ఞాపికలు అందించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎంపీపీ ఎన్నిక

కపిలేశ్వరపురం, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం ఎంపీపీ ఎన్నిక గురువారం ఉదయం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో హెచ్.భానూజీరావు తెలిపారు.

రైతులకు తక్షణం నష్టపరిహారం చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ నాయకుడు కొప్పుల సత్తిబాబు

అమలాపురం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వరుసగా సంభవించిన తుఫాన్లతో నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించడంతో పాటు మిగిలిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్‌తో అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట సీపీఐ, రైతుసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వరుణ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాకు రాష్ట్ర సమితి సభ్యుడు కొప్పుల సత్తిబాబుముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్, సీడ్ బిల్లులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వరుస తుఫాన్లు, అధిక వర్షాలతో నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఎంసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కుడుపూడి సత్యనారాయణ, కొలిశెట్టి బులిసత్తియ్య, యాళ్ల రామారావు, శ్రీపతి శ్రీను, జి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

అంబాజీపేట, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే నాణ్యమైన దిగుబడులతో పాటు ఆరోగ్యకరమైన పంటలను పొందవచ్చునని ఏవో కె.ధర్మప్రసాద్ అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఆత్మా ఆధ్వర్యంలో8,9 తరగతుల విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షల విధానం, యాజమాన్య పద్ధతులు, మట్టి సేకరణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. భూసార పరీక్షా కేంద్ర వ్యవసాయాధికారి ఎం.శిరీషా పాల్గొన్నారు.

'బోధనా సమయం వృథా చేస్తున్న ప్రభుత్వం'

అంతర్వేది, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనా సమయాన్ని ప్రభుత్వం వృథా చేస్తుందని, చీటికీ మాటికీ వివిధ కార్యక్రమాలు పెడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపీమూర్తి అన్నారు. సఖినేటిపల్లి మండలానికి విచ్చేసిన ఆయన పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. పోరాట స్ఫూర్తితోనే తనకు ఎమ్మెల్సీగా అవకాశం వచ్చిందని, పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు నల్లి విశ్వనాథం, గొల్లమందల రాజబాబు, పి.సూర్యచంద్రరావు, గోపీరాజు, పి.రామసత్యనారాయణ, నాగశ్రీనివాస్, కోలా వీరాస్వామి, జగదీప్ పాల్గొన్నారు.

నూతన మొక్కజొన్న వంగడాలను సాగు చేయాలి



లంక గ్రామాల్లో రైతులకు మొక్కజొన్న హైబ్రీడ్ రకం కిట్లను అందజేస్తున్న శాస్త్రవేత్తలు

ముమ్మిడివరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటలో అధిక దిగుబడులు సాధించేందుకు నూతన హైబ్రీడ్ వంగడాలను సాగు చేయాలని పెద్దాపురం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయం, వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్తల బృందం రైతులకు సూచించింది. పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రామభద్రరాజు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఐ.సుధీర్‌కుమార్, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నందకిశోర్‌లతో కూడిన బృందం జిల్లాలో పలు లంక గ్రామాలను బుధవారం సందర్శించారు. గేదెల్లంక, శేరిలంక, కమినిలంక, లంకాఫ్ ఠాణేలంకను సందర్శించి అక్కడ రైతులకు సూచనలు, సలహాలు అందించారు. రాష్ట్రం అంతటా మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెంచేందుకు ఎంపికచేసిన అభ్యుదయ రైతులకు అఖిలభారత మొక్కజొన్న సమన్వయ పథకం ద్వారా మేలైన అధిక దిగుబడులను ఇచ్చే మొక్కజొన్న హైబ్రీడ్ రకం కిట్లను అందజేస్తున్నామన్నారు. మొక్కజొన్న సాగులో మెలకువలు, సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. జిల్లాలో లంక గ్రామాల్లో 15ఎకరాల విస్తీర్ణంలో ఎకరాకు ఏడుకిలోల వంతున హైబ్రీడ్ మొక్కజొన్న కిట్లను అందించారు. స్థానిక రైతులు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులకు శంకుస్థాపన

మలికిపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పడమటిపాలెం, గొల్లపాలెం, తూర్పుపాలెం, కూనవరం, చింతలపల్లి గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. తీర ప్రాంత గ్రామాల్లో నేటికి కూడా మంచినీటి కష్టాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయని, ఆ సమస్యలు అన్ని ఒక్కొక్కటిగా తొలగించి ప్రతి ఇంటికి మంచినీరు అందించాలని ధృడ సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు.

65వేల సంతకాల సేకరణ

పి.గన్నవరం,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పి.గన్నవరం నియోజ కవర్గం నుంచి 65వేల సంతకాలను సేకరించి నట్టు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గన్నవరపు శ్రీనివాసరావు తెలిపారు. పి.గన్నవరం నుంచి సంతకాల సేకరణ ప్రతులతో ర్యాలీగా బయలుదేరి అనంతరం మాట్లాడా రు. సంతకాల ప్రతులను పార్టీ జిల్లా అధ్య క్షుడు చిర్ల జగ్గిరెడ్డి, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ స్వగృహాలు వద్ద అందజేశామన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యం

రాజోలు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గ ప్రజల దాహార్తిని తీర్చడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రూ.1650కోట్ల సెంట్రల్ డెల్టా వాటర్ గ్రిడ్ మంచినీటి పథకంలో భాగంగా కూనవరంలో 60కేఎల్, చింతపల్లిలో 20కేఎల్ నూతనంగా నిర్మించనున్న వాటర్ ట్యాంకుల నిర్మాణానికి బుధవారం ఆయనశంకుస్థాపన చేశారు. శివారు ప్రాంతాల ప్రజలకు తాగునీరందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. డిప్యూటీ మాజీ స్పీకర్ అల్లూరి వెంకటసూ ర్యనారాయణ రాజు, టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధుడికి త్రీవీలర్ బ్యాటరీ వాహనం అందజేత



బ్యాటరీ మోటారు వాహనాన్ని అందజేస్తున్న జనసేన నాయకులు

అమలాపురం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతుల సమస్యలను, తీర ప్రాంత కొబ్బరి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు రాజోలు నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు రాజోలుకు చెందిన కొమ్ముల త్రినాథరావు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. తనకు వరుసగా రెండు వాహన ప్రమాదాలు జరిగాయని, ప్రస్తుతం చిన్న తాటాకు ఇంట్లో నివాసం ఉంటున్నానని, నడవలేనిస్థితిలో ఉన్న తనకు వాహనాన్ని ఇప్పించాలని పవన్‌కల్యాణ్‌ను అభ్యర్థించారు. దీంతో పవన్ వెంటనే స్పందించి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు సూచనలు చేశారు. దీంతో కలెక్టర్ త్రీవీలర్ మోటారు వాహనాన్ని మంజూరు చేయగా త్రినాథరావుకు జనసేన నాయకుల ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పోలిశెట్టి నాయుడు, పిండి సురేష్, రొక్కాల నాగేశ్వరరావు, నాగా సుబ్బరావు, అయిల నాగేశ్వరరావు, లింగోలు కృష్ణ, మోటుపల్లి వీరభద్రరావు, గుత్తుల శివ తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల కార్యక్రమం విజయవంతం

అమలాపురం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయానికి కోటి సంతకాల సేకరణ ద్వారా ప్రజాగ్రహం వ్యక్తమవుతుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని, విద్యార్థులు సైతం డిమాండ్ చేస్తున్నారని ఆయన వివరించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన సంతకాల సేకరణ పత్రాలను భారీ ఊరేగింపుల నడుమ భట్నవిల్లిలోని మాజీమంత్రి పినిపే విశ్వరూప్ స్వగృహం వద్దకు తీసుకువచ్చారు. మాజీమంత్రి విశ్వరూప్, నియోజకవర్గాల కోఆర్డినేటర్లు, మాజీ ఎమ్మెల్యేలు గొల్లపల్లి సూర్యారావు, పొన్నాడ సతీష్‌కుమార్, పిల్లి సూర్యప్రకాష్, డాక్టర్ పినిపే శ్రీకాంత్, గన్నవరపు శ్రీనివాస్, పొగాకు శ్రీను, సరెళ్ల రామకృష్ణ, కుడుపూడి బాబు పాల్గొన్నారు.

ప్రపంచ మానవహక్కుల దినోత్సవం

మలికిపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న మానవహక్కులు నేటి ప్రపంచీకరణ పరిస్థితుల కారణంగా నిరాకరించబడుతున్నాయని మానవహక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేడిద రాజేష్ అన్నారు. ప్రజాస్వామ్యదేశాల్లో కూడా ఓటు రాజకీయాలు పెరిగిపోయి రాజ్యాంగ ప్రసాదించిన మానవ హక్కులకు తీవ్ర సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. ప్రపంచ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన వర్కుషాపులో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆనందమహనీ, నక్కా రమేష్‌బాబు, ఐక్యూ ఏసీకోఆర్డినేటర్ పి.సూర్యనారాయణరావు పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

ముమ్మిడివరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): హక్కులంటే చట్టపరమైన సామాజిక, నైతిక సూత్రాల ప్రకారం వ్యక్తులకు లభించే స్వేచ్ఛా అర్హతలని, అవి నాగరిక సమాజానికి మూల స్తంభాలు అని ముమ్మిడివరం మండలం లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరం కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, ఏజీపీ కాశి సిద్ధార్థకుమార్, న్యాయవాదులు దోనిపాటి ఆంజనేయులు, దాసరి సత్యనారాయణ, ప్యానల్ అడ్వకేట్ గుత్తుల శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

ముమ్మిడివరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు వైసీపీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం ద్వారా చేపట్టిన కోటి సంతకాల సేకరణకు స్పందన లభించిందని మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ పేర్కొన్నారు. సేకరించిన సంతకాల ప్రతుల బాక్సులను జిల్లా కార్యాలయానికి పంపించడం జరిగిందన్నారు. సీఈసీ సభ్యుడు పితాని బాలకృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు పెయ్యల చిట్టిబాబు, ఢిల్లీ నారాయణ, ఎంపీపీ కోలా గంగాభవానీ, మేరిమిరియం జ్యోతి, జడ్పీటీసీలు కుడుపూడి శంకరరావు, నేలకిశోర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా హుస్సేన్



మామిడికుదురు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మామిడికుదురుకు చెందిన నన్నేసా హుస్సేన్‌ను నియమించారు. మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి హుస్సేన్‌కు మాత్రమే అవకాశం కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈయన్ను పలువురు బీజేపీ నాయకులు, స్థానికులు అభినందించారు.

డ్వాక్రా సంఘాల అభివృద్ధికి పంచవర్ష ప్రణాళిక

ఉప్పలగుప్తం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాబోయే ఐదేళ్ల కాలంలో డ్వాక్రా సంఘాల సభ్యులు తమ వ్యక్తిగత, కుటుంబ, సమాజ అభివృద్ధికి ఏ విధమైన మార్గాలు అవలంభించాలో, ఎదురయ్యే అవాంతరాలను ఎలా అధిగమించాలో అవగాహన కల్పిస్తూ మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో డి.కృష్ణ ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ ఏపీవో అయితాబత్తుల సురేంద్రబాబు అధ్యక్షతన శిక్షణా కార్యక్రమంజరిగింది. ఈశిక్షణలో 42మంది గ్రామసంఘాల అధ్యక్షులు, 17గ్రామాల వీవోఏలు పాల్గొన్నారు. ఈశిక్షణ నాలుగు రోజులు జరుగుతుందని ఏపీవో తెలిపారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

అంబాజీపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేచాలని కొత్తపేట డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి అన్నారు. కె.పెదపూడి జడ్పీ హైస్కూల్‌ను ఆయన బుధవారం సందర్శించారు. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ వేణుగోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు తగవు'

ముమ్మిడివరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ఇటీవల జరిగిన మాదిగల ఆత్మీయ కలయికలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ చేసిన వ్యాఖ్యలను టీడీపీ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ముమ్మిడివరం నగరపంచాయతీ తిల్లమ్మచెరువుగట్టున బుధవారం బొమ్మి రామకృష్ణ నివాసగృహం వద్ద టీడీపీ ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం జరిగింది. చుట్టుగుళ్ల సత్యనారాయణ (అన్నవరం), సత్తాల వెంకట్రావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. మట్ట వెంకటేశ్వరరావు, బొమ్మి శ్రీను, సత్తాల శ్రీను, చుట్టుగుళ్ల వేణుగోపాలరావు, రాంబాబు, గిరి వెంకటప్రసాద్, తొత్తరమూడి రాంబాబు పాల్గొన్నారు.

'మాదిగల ద్రోహి జగన్'

మామిడికుదురు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మాదిగల ద్రోహి మాజీ ముఖ్యమంత్రి జగన్ అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుట్టుగుళ్ల కిశోర్ విమర్శించారు. గురువారం జరిగే మాదిగల ఆత్మీయ కలయిక వనసమారాధనకు సంబంధించి మామిడికుదురులో నిర్వహించిన సమావేశంలో పలువురు కూటమి నాయకులు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మాదిగల ద్రోహి జగన్మోహన్‌రెడ్డి అని, మాదిగల పెద్ద చంద్రబాబునాయుడు అని పేర్కొన్నారు. టీడీపీ ఎస్సీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ నేదునూరి నతానియేలు, ఉండ్రాజవరపు శ్రీనివాసరావు, నేదునూరి నాని, మందా రాజేష్, నేదునూరి రాజ్‌కుమార్, సవరపు అబ్రహం, నేదునూరి రామకృష్ణపాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు శ్రీను మృతి



ముమ్మిడివరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ సోమిదేవరపాలేనికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సలాది వెంకటేశ్వరరావు (శ్రీను)(62) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందారు. ఆయనకు భార్య రమాదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య రమాదేవి గతంలో ముమ్మిడివరం నగర పంచాయతీ 9వ వార్డు కౌన్సిలర్‌గా పనిచేశారు. వెంకటేశ్వరరావు తండ్రి బుచ్చినారాయణ సోమిదేవరపాలెం సర్పంచ్‌గా, టీడీపీలో పలు పదవులు నిర్వహించారు. వెంకటేశ్వరరావు మృతి పట్ల కూటమి నాయకులు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

డ్రగ్స్‌కు వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములవుతాం

అమలాపురం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్వహించే ప్రతీ కార్యక్రమంలో భాగస్వాములం అవుతామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.దుర్గారావు ఆధ్వర్యంలో పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ ఫోరం ప్రతినిధి టి.పవన్ ముఖ్య అతిథిగా హాజరై డ్రగ్స్ వినియోగం వల్ల జరిగే నష్టాలను, భవిష్యత్తు పరిణామాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈగల్ డిపార్టుంటుకు చెందిన సత్యనారాయణ, రఘుకిరణ్, పాఠశాల హెచ్ఎం విజయకుమారి, నాగిరెడ్డి శివప్రసాద్, శ్రీనుబాబు, ఫిజికల్ డైరెక్టర్ కరాటం రవిసుధీర్ పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు రూ.20.63కోట్లు

పి.గన్నవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రధాన, గ్రామీణ రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నియోజకవర్గంలో పలు రహదారులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. వివరాలను ఆయన ఫోన్‌లో వెల్లడించారు. పి.గన్నవరం మండలంలో ఏడు పనులకు 14.247కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.7.94కోట్లు, మామిడికుదురు మండలంలో 4పనులకు 8.036 కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.4.41కోట్లు, అంబాజీపేట మండలంలో ఐదుపనులకు 8.822కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.4.71కోట్లు, అయినవిల్లి మండలంలో రెండు పనులకు 3.793కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.2.11కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. శివాయిలంక ఏటిగట్టు నుంచి గ్రామంలోకి 1.06కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.1.03 కోట్లు కేటాయించడంపై ఎమ్మెల్యే, ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.


హిందూ మతంపై విశ్వాసం పెంచేందుకు కృషి

మామిడికుదురు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): హిందూ మతం పట్ల విశ్వాసం పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్టు సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ భైరిశెట్టి కోటేశ్వరరావు తెలిపారు. అప్పనపల్లిపాలెంలోని గుత్తులవారిపాలెం వద్ద రామకోటి పుస్తకాలను బుధవారం ఆవిష్కరించారు. రామకోటిని భక్తిశ్రద్ధలతో రాయాలని సూచించారు. హిందూమతం వ్యాప్తి కోసం ప్రతీ గ్రామంలో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

డ్రగ్స్ అదుపునకు ప్రత్యేక సమావేశాలు

అల్లవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో మహిళల రక్షణ, డ్రగ్స్ అదుపునకు ప్రత్యేక సమావేశాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నామని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా అల్లవరం పోలీసుస్టేషన్‌లో బుధవారం రికార్డులను తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల విషయంలో పోలీసు నిఘా కొనసాగిస్తున్నామన్నారు. అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, అల్లవరం ఎస్ఐ జి.సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ వెంకటలక్ష్మి మృతి



అమలాపురం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సాకుర్రు మాజీ సర్పంచ్ ఆకుల వెంకటలక్ష్మి బుధవారం ఉదయం మృతిచెందారు. గ్రామ ప్రముఖులతో పాటు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. సర్పంచ్ గుత్తుల చిరంజీవి, వైస్ ఎంపీపీ పొలమూరి బాలకృష్ణ, మాజీ సర్పంచ్‌లు ములపర్తి సత్యనారాయణ, చొల్లంగి సత్యసాయిబాబా, నాయకులు పొలమూరి ధర్మపాల్, బండారు వెంకటేశ్వరరావు, శిరగం సత్తిబాబు, పీకే రావు, ఎన్.సూర్యచంద్రరావు, బండారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యానాం ప్రజలకు సంక్రాంతి కానుక

యానాం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎన్.రంగసామి సంక్రాంతి కానుకను ప్రకటించారు. పుదుచ్చేరి, కారైకాల్, మహే, యానాం నియోజకవర్గాల్లో రేషన్ కార్డుదారులకు రూ.750 విలువైన సంక్రాంతి కానున ఇస్తున్నట్టు ప్రకటించారు. పుదుచ్చేరి పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. యానాంలో 15,489 లబ్ధిదారులు ఉన్నారు. 4కిలోల బియ్యం, కిలో పంచదార, కిలోపెసరపప్పు, 300 గ్రాముల నెయ్యి, కిలో సన్‌ఫ్లవర్ ఆయిల్‌తో కిట్‌ను అందిస్తామన్నారు.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించుకుంటున్న భక్తజనం

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వేకువజామునే స్వామివారికి ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం, నివేదన కార్యక్రమాలను నిర్వహించారు. వసంత మండపంలో స్వామివారి కల్యాణం రమణీయంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులుఅన్నప్రసాదం స్వీకరించారు. ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ బోరంపేటకుచెందిన కిలారు సోమశేఖర్-దివ్యతేజ దంపతులు రూ.1,11,111 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు. ఆలయఉపకమిషనర్ ఎన్.సూర్యచక్రధరరావు ఏర్పాట్లు చేశారు.

నియోజకవర్గానికి 35 ఆరోగ్య కేంద్రాలు మంజూరు

● కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కొత్తపేట నియోజకవర్గానికి సంబంధించి వైద్య సేవలను బలోపేతం చేసేందుకు 35 ఆరోగ్య కేంద్రాలు, 2 ఆరోగ్య యూనిట్లు మంజూరైనట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. దీనిపై బుధవారం ఆయన మాట్లాడుతూ తాను ఇదే విషయమై వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను కోరామన్నారు. దాంతో ఈ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం నిమిత్తం రూ.13.71కోట్ల వ్యయంతో ఈ నిర్మాణాలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలసిన న్యాయవాదులు



జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి గంధం సునీతకు కృతజ్ఞతలు తెలుపుతున్న న్యాయవాదులు

రామచంద్రపురం(ద్రాక్షారామ),డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి గంధం సునీతను బుధవారం రామచంద్రపురం బార్‌అసోసియేషన్‌కు చెందిన పలువురు న్యాయవాదులు, బార్ అసోసియేషన్ మాజీ ప్రతినిధులు కలిశారు. రామచంద్రపురంలో జిల్లా కోర్టు ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకుని బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వుండవిల్లి గోపాలరావు, మాజీ అధ్యక్షుడు పిల్లిమురళీ, ముషిణి సర్వారాయుడు, పోలిశెట్టి శ్రీనివాసరావు, దొమ్మలపాటి సత్యనారాయణ న్యాయవాదులు వాకలపూడి జయశంకర్, సూరంపూడి సత్యనారాయణ, బోడపాటి సురేష్‌కుమార్, సన్నపు కుమారస్వామి, చిన్నం వీర్రెడ్డి, పిల్లా పృధ్విరామయ్య, చోడి జాన్‌రత్నం తదితరులు జిల్లాకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలసి కృతజ్ఞతలు తెలిపారు.

ఏడిద సావరంలో

పొలం పిలుస్తోంది కార్యక్రమం

● వరి దుబ్బులు కాల్చడంతో భూసారానికి నష్టం

● వ్యవసాయాధికారి ప్రభాకర్



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారి, సిబ్బంది

మండపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండపేట మండలం ఏడిదపంచాయతీ పరిధిలోగల ఏడిదసావరంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంను నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారి కె.ప్రభాకర్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో రైతులకు వ్యవసాయశాఖద్వారా ప్ర భుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. పంటకోతలు పూర్తయిన నేపథ్యంలో రైతులు పొలంలో వరి దుబ్బులకు నిప్పుపెట్టడంవల్ల కలిగేనష్టం గురించి ఆయన రైతులకు వివరించారు. నిప్పుపెట్టడంవల్ల పంటకు మేలు చేసే సేంద్రియ భూసారం దెబ్బతింటుందన్నారు. రైతులు పొలంలో దుబ్బులను నీటిలో నానిన తర్వాత దమ్ముచేసి దమ్ములో కలియదున్నటంవల్ల భూసారం పెరిగి భూమికి బలం అందుతుందన్నారు. వరిదుబ్బుకు నిప్పు పర్యావరణంకు ముప్పని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్‌పై దృష్టి సారించాలి



ఊబలంక జడ్పీ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న టౌన్ సీఐ శేఖర్‌బాబు

రావులపాలెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు చెడు వ్యసనాలకు లోనుకాకుండా భవిష్యత్‌పై దృష్టిసారించాలని రావులపాలెం టౌన్ సీఐ ఎం.శేఖర్‌బాబు అన్నారు. ఊబలంక జడ్పీ పాఠశాలలో సైబర్ క్రైమ్, డ్రగ్‌పై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ పిల్లలు సెల్‌ఫోన్ వినియోగంపై తల్లిదండ్రులు దృష్టిసారించాలన్నారు. విద్యార్థులు తెలియని లింకులు ఓపెన్‌చేసి ఇబ్బందులకు గురికావద్దన్నారు. ఎవ్వరైనా డిజిటల్ అరెస్ట్‌పేరున బెదిరిస్తే 1930కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు బైక్‌లు ఇచ్చి ఇబ్బందులకు గురికావద్దని సీఐ హెచ్చరించారు.

రాజీ నో..కాంప్రమేజ్ చిత్రం షూటింగ్



గుద్దాయిలంకలో షూటింగ్‌లో పాల్గొన్న హీరో రాంకీ, హీరోయిన్ జయశ్రీ

పి.గన్నవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కోనసీమలోని పల్లెల అందాలను రాజీ నో కాంప్రమేజ్ చిత్రం ద్వారా దర్శకుడు గెద్దాడ సత్య వెంకట్ తెరకెక్కిస్తున్నారు. 70శాతం చిత్రీకరణ కోనసీమలో తీయనున్నట్టు తెలిపారు. బుధవారం నాగుల్లంక శివారు గుద్దాయిలంకలో హీరో, హీరోయిన్‌తో సాగే షోలోసాంగ్‌కు సంబంధించి వరి చేలు, రోడ్లపై పలు సన్నివేశాలను దర్శకుడు వెంకట్, కొరియోగ్రాఫర్ స్వర్ణ చిత్రీకరించారు. నిర్మాత, చిత్ర హీరో రాంకీ మాట్లాడుతూ రాజీ నో కాంప్రమేజ్ చిత్రం కోనసీమలో ప్రారంభించామని, 70శాతం చిత్రీకరణ రాజోలు, అమలాపురం పరిసర ప్రాంతాల్లో, 30 శాతం బెంగళూరు, హైదరాబాద్‌లో జరుగుతుందని చెప్పారు. ఈచిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా ఎం.శ్రీదేవి, హీరోయిన్‌గా జయశ్రీ, ముఖ్యతారాగణంగా రాజీవ్ కనకాల, పృధ్వీరాజ్, జబర్దస్ టీమ్ అశోక్, రాము తదితరులు నటిస్తున్నారని చెప్పారు. ఈచిత్రంలో ఐదు పాటలు ఉంటాయని, వీటిని దేవవరపు నీలకంఠ రాశారని, గోదావరి, ఆనంద్, చందమామ ఫేమ్ కె.ఎం.రాధాకృష్ణ సంగీతం అందిస్తున్నారని చెప్పారు. ఎడిటర్ శ్రీవర్కల, కెమెరామెన్‌గా కార్తీక్ పనిచేస్తున్నారు. ముంబాయి నుంచి వచ్చిన జయశ్రీ హిందీ, అస్సాం బాషల్లో చైల్డ్ ఆర్టిస్టగా పలు సినిమాల్లో నటించారు. హీరో రాంకీకి ఇది మూడో సినిమా. మొదటి సినిమా గంగపుత్రులు, రెండోది జర్నలిస్టు. గంగపుత్రులు సినిమాకు రాంకీకి నంది అవార్డు వచ్చింది.

అధ్వానంగా రహదారులు

● ఇసుక లారీల రాకపోకలతో దిగబడిపోయిన రోడ్డు

● కోతకుగురైన రహదారి మార్జిన్‌లు

● ఈ రోడ్డులో వెళ్లాలంటే ప్రయాణికుల నరకయాతన

● పట్టించుకోని అర్‌అండబీ అధికారులు



అధ్వానంగా కోరుమిల్లి-తాతపూడి ఏటిగట్టు రహదారి





ప్రమాదభరితంగా మారిన కపిలేశ్వరపురం-అంగర ఆర్‌అండ్‌బీ రహదారి

కపిలేశ్వరపురం, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన కపిలేశ్వరపురం నుంచి మండపేటకు వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి, కోరుమిల్లి నుంచి తాతపూడి, జొన్నాడ వెళ్లే ఏటిగట్టు రహదార్లు అధ్వానంగా మారాయి. దీనిపై ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు నిత్యం ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. పలుచోట్ల రహదారులు గుంత లు పడిపోవడం, రాళ్లు పైకి లేచిపోవడం, వర్షాలకు నీరు నిలబడిపోయి రహదారిమార్గం కనిపించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. భారీ వాహనాలవల్ల పలుచోట్ల రోడ్లు దిగబడిపోవడం, రహదారి మార్జిన్‌లు కోతకు గురవడంతో ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం. ఇటీవల కపిలేశ్వరపురం నుంచి అంగర ఆర్‌అండ్‌బీ రహదారిలో ఏర్పడ్డ గుంతలు కారణంగా రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఒక యువకుడు మృతిచెందాడు. ఇలాంటి ప్రమాదకర సంఘటనలు అనేకం జరుగుతున్నా అధికారు లు పట్టించుకోకపోవడంపట్ల గ్రామస్థులు, ప్రయాణికులు, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారులను మెరుగుపర్చాలని కోరుతున్నారు.



మాచవరంలో డ్రైన్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల.

రోడ్లు, డ్రైన్ల పనులు త్వరగా పూర్తిచేయాలి

● ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

రాయవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని మాచవరం గ్రామంలో ఎంజీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును ఎమ్మెల్యే పరిశీలించి పనులు త్వరితగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు మేడపాటి రవీంద్రారెడ్డి, రొంగల సత్యనారాయణ, నల్లమిల్లి వెంకటరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, శెట్టి రవి, తీగిరెడ్డి ప్రశాంత్, పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

మండపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టీ.కె.వి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వేగుళ్లజోగేశ్వరరావు మేళాను ప్రారంభిస్తారని ఆయన అన్నారు. ఈజాబ్ మేళాకు 20 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని ఆయన చెప్పారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈఅవకాశంను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మానవహక్కులపై

అవగాహన కలిగి ఉండాలి



రావులపాలెంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

రావులపాలెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే మానవహక్కులపై అవగాహన కలిగి ఉండటంతోపాటు హక్కులపై బాధ్యతలు గుర్తెరిగి నడుచుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన పొలిటికల్ సైన్సు అధ్యాపకులు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మానవ హక్కులను ప్రతిఒక్కరూ కాపాడాలన్నారు. వీటిపై జిల్లా, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి కమిటీలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అధ్యాపకులు రమేష్ బాబు, సిద్ధార్థ, సుభాషిణి, సుమలత, రజని, పాల్గొన్నారు.

మానవహక్కులపై అవగాహన సదస్సు

రామచంద్రపురం(ద్రాక్షారామ),డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సీఎస్‌సీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, బాధ్యతలు కోసం మానవహక్కుల ఉల్లంఘన జరిగితే ప్రశ్నించే తత్వం అలవాటు చేసుకోవాలని, సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని మీడియేషన్ న్యాయవాది దొమ్మలపాటి సత్యనారాయణ, అనుపమలు కోరారు.

నేడు ఎంపీపీ ఎన్నిక

కపిలేశ్వరపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవికి గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో హెచ్.భానూజీరావు తెలిపారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ అమరావతి వారి ఎన్నికల నోటిఫికేషన్ పురష్కరించుకుని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిణి, డివిజినల్ డవలప్‌మెంట్ అధికారిణి వి. విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2025 అక్టోబరు 13న ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి తన పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ అయిన ఈ పదవికి ఎన్నిక జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లుచేస్తామని ఎన్నిక సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎలక్షన్‌కు సంబంధించి ఎంపీటీసీలందరికీ ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఈ ఎన్నిక నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో భానూజీరావు తెలిపారు.

23న క్రిస్మస్ వేడుకలు

రాయవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు గ్రామంలో ఈనెల 23న మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ జె.సాల్మన్‌రాజు తెలిపారు. బుధవారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ చెల్లూరు పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలకు పాస్టర్స్ ఫెలోషిప్ జాతీయ ప్రధాన కార్యదర్శి డానియేల్ పాల్‌తో పాటు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఏపీ ఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, పారిశ్రామికవేత్త సురేష్‌కుమార్ తదితరులు పాల్గొంటారన్నారు. ఈకార్యక్రమంలో మండల పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు, క్రైస్తవులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఇంటర్ ఫలితాలే విద్యార్థులకు పునాది : ఆర్డీవో మాధవి

అమలాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు విద్యార్థుల జీవితాలకు బేస్‌గా నిలుస్తాయని ఆర్డీవో కె.మాధవి అన్నారు. బుధవారం అమలాపురంలోని వడ్డిగూడెం సాంఘిక సంక్షేమశాఖ కళాశాల వసతిగృహంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆసక్తితో విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తూ ఉన్నత చదువులను చదివి మంచి పేరు సంపాదించాలని విజ్ఞప్తి చేశారు. ఎంచుకున్న గోల్స్‌ను ఆత్మవిశ్వాసంతో సాధించేందుకు ముందుకు సాగాలన్నారు. మోడల్ టెస్ట్‌లకు స్పష్టమైన ప్లానింగ్‌తో ఒత్తిడి లేకుండా ప్రిపేర్ కావాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్, సాంఘిక సంక్షేమశాఖ సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి, వసతి గృహ ఉపాధ్యాయులు, అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

గర్భిణుల ప్రసవ సమయంలో

మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ మహేష్‌కుమార్



వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గర్భిణులు ప్రసవ సమయంలో మరణాలు సంభవించకుండా వైద్యశాఖ అధికారులు నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన మాతా శిశు మరణాల రేటు, ప్రసవ సమయంలో గర్భిణుల మరణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రసవ సమయంలో ఐదుగురు గర్భిణులు ఇటీవల మరణించినట్టు గుర్తించామన్నారు. ఈ మరణాలు సంభవించడానికి గల కారణాలు అన్వేషించి పూర్తి స్థాయి నివేదికను అందించాలని వైద్యులను ఆదేశించారు. ఆసుపత్రిలో మరణాల రేటు తగ్గించేందుకు వైద్యులు అన్నివిధాలా పాటుపడాలని సూచించారు. ప్రసవ సమయంలో గర్భిణీ మరణం పెద్ద ప్రజారోగ్య సమస్యగా గుర్తించాలన్నారు. గర్భధారణ, ప్రసవ నిర్వహణలో వైద్యులు సకాలంలో సేవలు అందించకపోవడం, సంక్లిష్టతలను ముందుగా గుర్తించి మెరుగైన వైద్యసేవలు ఉన్నచోటుకు వారిని తరలించాలన్నారు. శిక్షణ పొందిన వైద్యుల పర్యవేక్షణలో తప్పనిసరిగా ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. హైపర్ టెన్షన్, అధిక రక్తపోటు, తలనొప్పి, కాళ్ల వాపు వంటి వ్యాధులపై పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సమయాల్లో శస్త్రచికిత్స సదుపాయాలు ఉపయోగించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో దుర్గారావుదొర, డీసీహెచ్‌ఎస్ కార్తీక్, డాక్టర్ భరతలక్ష్మి, డాక్టర్ సుమలత, ప్రైవేటు ప్రసూతి వైద్యులు గిరిజ, శారద, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ కలయికకు తరలిరావాలి



రావులపాలెంలో నిర్వహించిన ఎంఆర్పీఎస్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

రావులపాలెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జనవరి 25న నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మాదిగల ఆత్మీయ కలయికకు పెద్దఎత్తున తరలిరావాలని ఎంఆర్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర రాఘవతోపాటు ఎంఎస్పీ, అనుబంధ సంఘాల సభ్యులు కోరారు. రావులపాలెంలో కొమ్మర రాఘవ ఆధ్వర్యం లో కొత్తపేట నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాఘవ మాట్లాడుతూ జనవరి 25న నిర్వహించే మాదిగల ఆత్మీయ కలయికకు ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. రాజకీయ పార్టీలలో ఉన్న మాదిగ ప్రజాప్రతినిధులందర్నీ ఆహ్వానించనున్నామన్నారు. భారీస్థాయిలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం యాకోబు, కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాప నాగరాజు, సీనియర్ నాయకులు ముప్పిడి రాజు, కొడమంచిలి చిరంజీవి, రాచర్ల అరుణ్, చంద్రశేఖర్, రాజు, ప్రేమ్‌కుమార్, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

'నియోజకవర్గంలో 60వేల సంతకాలు సేకరించాం'

ద్రాక్షారామ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం నియోజకవర్గంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించవద్దని కోరుతూ వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా 60వేలు సంతకాలు సేకరించినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సహకారంతో సంతకాలు విజయవంతంగా సేకరించామన్నారు. అమలాపురం జిల్లా కార్యాలయానికి సంతకాలపత్రాలతో కూడిన వాహనాన్ని స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఎంపీపీ అంబటి భవానీ, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మీ, ఏపీఐడీసీ మాజీ డైరెక్టరు శ్యామ్, పెట్టా శ్రీనివాసరావు, పండుగోవిందరాజు, మురళీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.



సంతకాల ప్రతులను చూపుతున్న సూర్యప్రకాష్ తదితరులు

న్యాయవిజ్ఞాన సదస్సు

ముమ్మిడివరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): హక్కులంటే చట్టపరమైన సామాజిక, నైతిక సూత్రాల ప్రకారం వ్యక్తులకు లభించే స్వేచ్ఛా అర్హతలని, అవి నాగరిక సమాజానికి మూల స్తంభాలు అని ముమ్మిడివరం మండలం లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరం కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, ఏజీపీ కాశి సిద్దార్థ కుమార్, న్యాయవాదులు దోనిపాటి అంజనేయులు, దాసరి సత్యనారాయణ, ప్యానల్ అడ్వకేట్ గుత్తుల శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.